భక్తి యోగం

# శ్రీ గోవిందనామ వైభవం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)


## http://ebooks.tirumala.org



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# శ్రీ గోవిందనామ వైభవం

## (గోవిందనామాల విశ్లేషణ)


రచన

లంకెల గాంధీరెడ్డి,

జానకిరామమ్మ



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2014

# SRI GOVINDANAMA VAIBHAVAM

**by**
**L. GANDHI REDDY**
**JANAKIRAMAMMA**

T.T.D. Religious Publications Series No. 1073
© All Rights Reserved

*Editor-in-Chief*
**Prof. Ravva Sri Hari**

*First Edition :* 2014

*Copies :* 3000

*Published by :*
**M.G. GOPAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Office of the Editor-in-Chief
T.T.D., Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

"నామసంకీర్తనం విష్ణోః సర్వపాప ప్రణాశనం"

శ్రీహరి నామస్మరణ చేతనే సకల పాపాలు తొలగిపోతాయని శ్రీమహాభాగవతం పేర్కొంటుంది. ఆది నుండి అనాది దాకా మనం ఒక్కసారి గమనిస్తే అజామిళుడు, ధ్రువుడు, ప్రహ్లాదుడు, గజేంద్రుడు మున్నగువారే కాక ఎందరెందరో భక్తవరేణ్యులు ఆ పరబ్రహ్మ నామసంకీర్తనం చేత మోక్షాన్ని పొందగలిగారు.

విశేషించి కలియుగంలో శ్రీహరి నామసంకీర్తనం మాత్రమే మోక్షప్రదాయకం. కృతయుగంలో కఠోర తపస్సు, త్రేతాయుగంలో యజ్ఞయాగాలు, ద్వాపరయుగంలో అర్చన పూజాధికాలు మోక్షప్రదాయకాలు కాగా కలియుగంలో అత్యంతసులువైన హరినామసంకీర్తనమే మోక్షప్రదాయకమని మన ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. అన్నమాచార్యులు, త్యాగరాజు, పురందరదాసు, రామదాసు, కబీర్‌దాసు మున్నగు వారెందరెందరో నామసంకీర్తనం ద్వారా ఈ కలియుగంలో మోక్షాన్ని సాధించగలిగారు.

"గోవిందనామవైభవం" అనే ఈ గ్రంథం కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారి నామస్మరణకు సంబంధించిన గ్రంథం – శ్రీనివాస గోవిందా... శ్రీవేంకటేశ గోవిందా... అంటూ కొనసాగే ఈ శ్రీనివాసుని నామాలను మనం నిత్యం వింటూ, స్మరిస్తూ కీర్తిస్తూ ఉంటాం. అయితే ఈ నామాలయొక్క ఆంతర్యాన్ని, పరమాత్ముని ఎందుకీ నామంతో కీర్తిస్తున్నాం అనే విషయాన్ని ఉదాహరణాత్మకంగా రచయిత శ్రీ లంకెల గాంధీరెడ్డి, శ్రీమతి జానకిరామమ్మ గార్లు ఈ గ్రంథంలో చక్కగా వివరించారు.

ఈ గ్రంథాన్ని భగవద్భక్తులు ఆదరించి అర్థవివరాలతో స్వామివారి నామస్మరణచేసి శ్రీనివాసుని కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తూ....

*సదా శ్రీవారి సేవలో..*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# మనవి



శ్రీదేవి భూదేవి సహిత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం చిట్టేల గ్రామం, వత్సవాయి మండలం, కృష్ణాజిల్లాయందు 2009లో నిర్మించబడినది.

నాటి నుండి నేటివరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూజలతోపాటు, గోవిందనామాల పారాయణం జరుగుచున్నది. దీనిలో పాల్గొన్న మాకు ఒక రోజు గోవిందనామాల్లోని 108 నామాలకు అర్థం వివరించిచెబితే బాగుంటుందని అనిపించింది. భారత, భాగవత, రామాయణ, భగవద్గీత, విష్ణు సహస్రనామాలలోని అంశాలను చేర్చి శ్రీహరి భక్తవాత్సల్యతను వివరించే కథలను 11రోజులు ప్రవచనం చేయగా ఆలయ అర్చక స్వాములు వారు దీనిని పుస్తక రూపంలో రూపొందిస్తే బాగుంటుందని సూచించారు. శ్రీవేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహం చేత, నా ధర్మపత్ని సహకారంచేత శ్రీనివాసుని 108 నామాలకు నాకు తోచిన మేర వ్యాఖ్యానంవ్రాయడం జరిగింది.

ఈ పుస్తకాన్ని పరిశీలించి టి.టి.డి. ధర్మప్రచారక స్వామి శ్రీశ్రీశ్రీ బాల బ్రహ్మానంద యోగిస్వామి వారు ఆనందించి గ్రంథానికి దివ్యసందేశంను అందించారు. వారికి పాదాభివందనాలు.

ఈ పుస్తకంను స్వీయప్రచురణగా స్వీకరించి సహకరించిన తిరుమల తిరుపతి దేవస్థానముల వారికి  మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ పుస్తకంను చదివిన వారందరు శ్రీహరిపై భక్తి భావంను పెంపొందించుకొనిన ఈ పుస్తకంను రూపొందించిన లక్ష్యం నెరవేరినట్లే.

ఈ పుస్తకం శ్రీ తిరుమల వేంకటేశ్వర స్వామి వారి పాదారవిందాలకు అంకితంగా  సమర్పించుకుంటున్నాము.

ఇట్లు,

**లంకెల గాంధీరెడ్డి, జానకిరామమ్మ**

# శ్రీ బాలబ్రహ్మానంద స్వామివారి
# ఆశీర్వచనం
# దివ్య సందేశం

గోవిందుని నామమే భవరోగాన్ని బాపే దివ్యౌషధం
గోవిందుని నామమే సంసార సాగరాన్ని దాటించే నావ
గోవిందుని నామమే కామక్రోధాది శత్రువులను వధించే దివ్యాయుధం

ఇట్టి దివ్య నామానికి వ్యాఖ్యానం వ్రాసిన **శ్రీ లంకెల గాంధీరెడ్డి శ్రీమతి జానకి రామమ్మ** పుణ్యదంపతులు ఎంత ధన్యజీవులు.

ఇక మహాత్ములు ఈ దివ్యనామాన్ని గూర్చి "కలౌ స్మరణానుముక్తిః" అన్నారు. ఈ కలియుగంలో గోవిందనామ స్మరణ ఒక్కటియే ముక్తికి మార్గం అని అర్థం.

**భక్త తులసీదాస్:**

"కలి నహి యోగ యజ్ఞ విజ్ఞాన ఏక ఆధార రామగుణగాన"

ఈ కలియుగంలో ముక్తిని పొందేందుకు యోగం. యజ్ఞం, విజ్ఞానం, ఉపకరించవు. ఒకే ఆధారం శ్రీ రామగుణ గానం చేయడం మాత్రమే అని చాటిచెప్పారు.

**శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు:**

హరిబోల్ హరిబోల్ హరిబోలో భాయీ
కలి ఔర్ గతినాహి నామభినా భాయీ

"ఓ సోదరుడా! ఈ కలియుగంలో భగవంతుని చేరుటకు హరి నామం తప్ప వేరేగతిలేదు. అందుకే హరి హరి హరి అని స్మరించు తరించు" అని ఉపదేశించారు.

**భక్తతుకారాం:**


నామ ఘేతా ఉతా ఉరీ హూయ సంసారీచీ తుటీ
ఏసాలాభ బాంధా గాంధీ! విఠలా పాయీ పడీ మిఠీ!
నామ పరతీ సాధన నాహీ! జేతుం ఆణేక కరసీ కాహీ!
హా కరోనీ సంగే తుకా! నామ ఘేతాం రహూ నకా!

తా. భగవన్నామమును గానం చేయండి. భవబంధంల నుండి బయట పడండి. భగవన్నామానికి మించిన లాభంలేదు. విఠలుని దివ్య కరుణాదృష్టితో సకల బాధల నుండి విముక్తి పొందగలరు.

నామ సాధనకు మించిన అత్యుత్తమ సాధన లేదు. హరిగుణ శ్రవణ కీర్తనాదుల యందు మనస్సును లగ్నంచేసిన భక్త జనులు తప్పక తరించ గలరని "తుకారాం" ఘంటాపథంగా గానంచేశారు.

"కృష్ణమ్మ" జిల్లా ఒడిలో "చిట్యాల" గ్రామంలో పుట్టిన ఈ రచయిత **శ్రీ లంకెల గాంధీరెడ్డి శ్రీమతి జానకిరామమ్మ** దంపతులు కృషి ప్రశంసనీయం. అభినందనీయం. ఇటువంటి రచనలు మరెన్నో చేయాలని ఆశిస్తూ ఆ దంపతులకు కోనేటి రాయుడి కృపా కటాక్షములు సర్వదా ప్రసరిస్తూ రక్షిస్తూ, కలిగిస్తూ, కాపాడుతూ ఉండాలని ఆ స్వామిని వేడుకొంటూ.

స్వామి సేవలో
**స్వామి బాలబ్రహ్మానంద యోగి**





# గోవింద నామావళి

శ్రీ శ్రీనివాసా గోవిందా
శ్రీ వేంకటేశా గోవిందా
భక్తవత్సల గోవిందా
భాగవతప్రియ గోవిందా
నిత్యనిర్మలా గోవిందా
నీలమేఘశ్యామ గోవిందా
పురాణ పురుషా గోవిందా
పుండరీకాక్ష గోవిందా
గోవిందా హరి గోవిందా
గోకుల నందన గోవిందా
నందనందన గోవిందా
నవనీతచోరా గోవిందా
పశుపాలకశ్రీ గోవిందా
పాపవిమోచన గోవిందా
దుష్టసంహార గోవిందా
దురిత నివారణ గోవిందా
శిష్టపరిపాలక గోవిందా
కష్ట నివారణ గోవిందా
వజ్రమకుటధర గోవిందా
వరాహమూర్తి గోవిందా
గోపీజనలోల గోవిందా
గోవర్ధనోద్ధార గోవిందా
దశరథనందన గోవిందా
దశముఖమర్దన గోవిందా
పక్షివాహనా గోవిందా
పాండవ ప్రియ గోవిందా
మత్స్యకూర్మ గోవిందా

మధుసూదన హరి గోవిందా
వరాహ నరసింహ గోవిందా
వామనభృగురామ గోవిందా
బలరామానుజ గోవిందా
బౌద్ధకల్కిధర గోవిందా
వేణుగానప్రియ గోవిందా
వేంకటరమణా గోవిందా
సీతానాయక గోవిందా
శ్రితపరిపాలక గోవిందా
దరిద్రజన పోషక గోవిందా
ధర్మసంస్థాపక గోవిందా
అనాథరక్షక గోవిందా
ఆపద్బాంధవ గోవిందా
శరణాగతవత్సల గోవిందా
కరుణాసాగర గోవిందా
కమలదళాక్ష గోవిందా
కామితఫలదా గోవిందా
పాపవినాశక గోవిందా
పాహి మురారే గోవిందా
శ్రీముద్రాంకిత గోవిందా
శ్రీవత్సాంకిత గోవిందా
ధరణీనాయక గోవిందా
దినకరతేజ గోవిందా
పద్మావతీప్రియ గోవిందా
ప్రసన్నమూర్తీ గోవిందా
అభయహస్తప్రదర్శన గోవిందా
మత్స్యావతార గోవిందా

శంఖచక్రధర గోవిందా
విరజాతీరస్థ గోవిందా
విరోధిమర్ధన గోవిందా
సాలగ్రామధర గోవిందా
సహస్రనామ గోవిందా
లక్ష్మీవల్లభ గోవిందా
లక్ష్మణాగ్రజ గోవిందా
కస్తూరీతిలక గోవిందా
కాంచనాంబరధర గోవిందా
గరుడవాహన గోవిందా
గజరాజరక్షక గోవిందా
వానరసేవిత గోవిందా
వారధిబంధన గోవిందా
ఏడుకొండలవాడ గోవిందా
ఏకస్వరూపా గోవిందా
శ్రీరామకృష్ణ గోవిందా
రఘుకులనందన గోవిందా
ప్రత్యక్షదేవా గోవిందా
పరమదయాకర గోవిందా
వజ్రకవచధర గోవిందా
వైజయంతిమాల గోవిందా
వడ్డికాసులవాడ గోవిందా
వసుదేవతనయా గోవిందా
బిల్వపత్రార్చిత గోవిందా
భిక్షుక సంస్తుత గోవిందా
స్త్రీపుంరూపా గోవిందా
శివకేశవమూర్తి గోవిందా
బ్రహ్మాండరూపా గోవిందా
భక్తరక్షక గోవిందా

నిత్యకల్యాణ గోవిందా
నీరజనాభ గోవిందా
హథీరామప్రియ గోవిందా
హరిసర్వోత్తమ గోవిందా
జనార్ధనమూర్తి గోవిందా
జగత్సాక్షిరూప గోవిందా
అభిషేకప్రియ గోవిందా
ఆపన్నివారణ గోవిందా
రత్నకిరీటా గోవిందా
రామానుజనుత గోవిందా
స్వయంప్రకాశ గోవిందా
ఆశ్రితపక్ష గోవిందా
నిత్యశుభప్రద గోవిందా
నిఖిలలోకేశా గోవిందా
ఆనందరూపా గోవిందా
ఆద్యంతరహితా గోవిందా
ఇహపరదాయక గోవిందా
ఇభరాజరక్షక గోవిందా
పరమదయాళు గోవిందా
పద్మనాభహరి గోవిందా
తిరుమలవాసా గోవిందా
తులసీవనమాల గోవిందా
శేషాద్రినిలయా గోవిందా
శేషశాయి గోవిందా
శ్రీ శ్రీనివాసా గోవిందా
శ్రీ వేంకటేశా గోవిందా
గోవిందా హరి గోవిందా
గోకులనందన గోవిందా

# గోవింద వైభవం

1. **గోవింద :** 1. ఇంద్రియాలకు ఆనందం కలిగించేవాడు. పంచేంద్రియాలు అనగా (1) కన్ను (2) ముక్కు (3) చెవి, (4) నోరు (నాలుక) (5) చర్మము.

    2. ప్రాణులను రక్షించేవాడు.

    **హరి :** అనగా విష్ణుమూర్తి, పాపాలను హరించువాడు. గోకుల నందన అనగా 'గో' అనగా ప్రాణులు, 'కుల' అనగా సముహం. నందన అనగా  ఆనందం కలుగజేయువాడు, నంద నందన అనగా నందుని కుమారుడు. వారి వృత్తి గోవులను కాయటం. శ్రీకృష్ణుడు కూడ ఆవులను కాశాడు.

2. **శ్రీ శ్రీనివాస గోవిందా :** శ్రీ అంటే లక్ష్మీదేవి. లక్ష్మీదేవిని వక్షస్థలంనందు ధరించిన వాడు. లక్ష్మి ఎక్కడ ఉంటే హరి అక్కడే ఉంటాడు.

3. **శ్రీ వేంకటేశా గోవిందా :** వేం అంటే పాపాలు, కటా అంటే నశింపజేయువాడు. పాపాలను నశింపజేయువాడని అర్థం.

4. **భక్తవత్సల గోవిందా :** భక్తులయందు ప్రేమకల్గినవాడు.

5. **భాగవత ప్రియా గోవిందా :** భగవంతుని నమ్మినవాడు, అంటే ఇష్ట పడేవారు. అంటే తనను నమ్మిన వారిని ప్రేమించేవాడని అర్థం.

6. **నిత్యనిర్మలా గోవిందా :** ఎల్లప్పుడు ప్రశాంతంగా ఉండేవాడు. స్పటికంవలె స్వచ్ఛంగా ఉండి ఎటువంటి కల్మషాలు అంటకుండా ఉండేవాడు (పవిత్రత కల్గినవాడు)

7. **నీలమేఘశ్యామా గోవిందా :** నీల వర్ణపు శరీరచ్ఛాయ కల్గినవాడు. భక్తులకు ఆనందం కలిగించేవాడు. దుష్టులకు కఠినమైన  వాడు.

8. **పురాణపురుషా గోవిందా :** పురాణాలలో కీర్తించబడినవాడు. అందువల్ల పురాణపురుషా గోవిందా అంటారు. పుర అనగా శరీరం. ప్రతి ప్రాణి శరీరంలోనూ నివసించేవాడు.

9. **పుండరీకాక్ష గోవిందా :** తామరపూవు వంటి కన్నులు గలవాడగుట చేత పుండరీకాక్ష అని పిలుస్తారు. హృదయ పద్మంలో ధ్యానింపబడే వాడు కావడంచేతను పుండరీకాక్ష అని కూడ పిలవబడుతున్నాడు. క్రీగంటి చూపు, విప్పారిన నయనాలతో భక్తులను దయార్ద్ర దృష్టితో వీక్షించువాడు.

10. **గోవిందా.. హరి గోవిందా**
**గోకుల నందన గోవిందా :**

11. **నంద నందనా గోవిందా :** నంద రాజు కుమారుడు శ్రీకృష్ణుడు. తల్లి దేవకీదేవి, తండ్రి వసుదేవుడు. దేవకి కంసుని చెల్లెలు. దేవకీదేవి గర్భంలో జన్మించిన 8వ శిశువు కంసుని చంపుతుందని, ఆకాశవాణి చెప్పడంవల్ల, కంసుడు వారిని కారాగారంలో బంధించాడు. 8వ శిశువుగా పుట్టిన కృష్ణుని వసుదేవుడు యమునా నదిని దాటించి నందుని భార్య అయిన యశోద ప్రక్కలో పడుకోబెట్టాడు. అందువల్ల యశోద, నందులు శ్రీకృష్ణునికి తల్లిదండ్రులు అయ్యారు.

12. **నవనీతచోర గోవిందా :** నవనీతం అంటే వెన్న. చోర అంటే దొంగ. భక్తుల యొక్క హృదయాలు వెన్నవలె అమృతప్రాయంగా ఉంటాయి. అటువంటి భక్తుల మనస్సులలో కొలువై ఉండి వారి హృదయాలను చూరగొనడంవల్ల నవనీతచోరుడు అయ్యాడు.

**13. పశుపాలకశ్రీ గోవిందా :** గోకులంలో ఉన్నపుడు గోవులను కాచే వాడు గనుక పశుపాలకశ్రీ అంటారు. పశువులు అనగా సమస్త జీవులు. పశుపాలకుడు అనగా సమస్త జీవరాశులను రక్షించువాడు.

**14. పాపవిమోచన గోవిందా :** గోవింద నామం పలుకగానే చేసిన పాపాలను పోగొట్టి విముక్తి కలుగజేసేవాడు కనుక పాప విమోచన అంటారు.

**15. దుష్టసంహార గోవిందా :** దుష్టులు అనగా చెడ్డవారు, సంహార అంటే చంపువాడు. చెడ్డవారైనటువంటి రాక్షసులను కంసుడు, నరకుడు, మొదలైనవారిని సంహరించినవాడు.

**16. దురితనివారణ గోవిందా :** దురితములు అంటే పాపాలు, మనుష్యులు తెలిసి, తెలియక చేసిన పాపాలన్ని, దైవ చింతనతో తొలగిపోతాయి. వాల్మీకి మొదట ఒక బోయవాడు. దారిదోపిడీ చేసి జీవించేవాడు. రామనామాన్ని అత్యంత నిష్ఠతో ధ్యానించడం వల్ల ఆ దేవదేవుడు పాపాలను పోగొట్టి రామాయణ రచన చేయించాడు.

**17. శిష్టపరిపాలక గోవిందా :** శిష్టులు అంటే మంచివారు. మంచి వారికి కష్టాలు వచ్చినపుడు గోవిందనామ స్మరణ చేస్తే వారి కష్టాలు తొలగిస్తాడు.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం।**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥.**

ఉ॥ ప్రహ్లాదుడు, సతీ సక్కుబాయి.

**18. కష్టనివారణ గోవిందా :** గోవిందనామ స్మరణ చేసే భక్తులకు రాబోవు కష్టాలను భగవంతుడు వెంటఉండి పోగొడతాడు. అక్షయ పాత్ర

శుద్ధిచేసి బోర్లించిన తరువాత ద్రౌపదివద్దకు దుర్వాస మహాముని భోజనానికి రాగా ద్రౌపది కృష్ణుని ప్రార్థించింది. స్వామి కృపతో ద్రౌపది కష్టాన్ని పోగొట్టి దూర్వాసుని బారినుండి రక్షించాడు.

**19. వజ్రమకుటధర గోవిందా :** మకుటం అంటే కిరీటం. వజ్రమకుట ధర అనగా అతి విలువైన వజ్రాలు పొదిగి తయారుచేసిన కిరీటంను ధరించినవాడు – వేంకటేశ్వర స్వామి. పద్మావతీ శ్రీనివాసుల కల్యాణ సందర్భంలో ఆకాశరాజు స్వామివారికి అత్యంత విలువైన వజ్రకిరీటాన్ని సమర్పించాడు.

**20. వరాహమూర్తి గోవిందా :** వరాహం అంటే పంది. హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు భూమిని ఒక బంతిలాచేసి సముద్రంలో పడవేయగా, శ్వేతవరాహ రూపంలో భూమిని తన కోరలతో బయటకు తెచ్చాడు విష్ణువు. వరాహ స్వామివారు శ్రీనివాసుడు కొండపై నివసించడానికి వేంకటాద్రిపై స్థలాన్ని ఇచ్చాడు. అందుకే ముందుగా వరాహస్వామిని దర్శించి తర్వాతనే వేంకటేశ్వరస్వామిని దర్శించాలి.

**21. గోపీజనలోలా గోవిందా :** గోపీ జనులు అనగా గోపికలు లేదా గోపికా స్త్రీలు. వారియందు ప్రేమ కలిగినవాడవటంచేత గోపీజనలోలుడు అని పేరు. త్రేతాయుగంలో శ్రీరాముని యొక్క అందానికి, ధర్మగుణానికి, మోహన రూపానికి ముగ్దులయిన మహర్షులు శ్రీరాముని భర్తగా పొందుట ఎంత అదృష్టమోకదా అని అనుకున్నారు. అది గ్రహించిన శ్రీరాముడు ద్వాపరయుగంలో శ్రీకృష్ణావతారంలో మీ కోర్కె తీరగలదని అనుగ్రహించాడు. అందువల్ల ఆనాటి మహర్షులే ఈ గోపికా స్త్రీలు. నిరంతరం భగవన్నామ స్మరణ

చేసే గోపికలంటే శ్రీకృష్ణునికి అమితమైన ప్రేమ. నిజానికి శ్రీకృష్ణుడు అస్కలిత (నిజమైన) బ్రహ్మచారి.

**22. గోవర్ధనోద్ధార గోవిందా :** అనగా గోవర్ధన పర్వతాన్ని చిటికెన వ్రేలుపై నిలిపినవాడు. పూర్వం దేవేంద్రుడు గోకులంపై రాళ్ళ వర్షం కురిపించాడు. ప్రజలను, గోవులను, కాపాడటానికి శ్రీకృష్ణుడు గోవర్ధనపర్వతాన్ని గొడుగువలె (చిటికెన వ్రేలుతో) పైకి లేపి వారందరిని కొండ క్రింది భాగంలో ఉంచి కాపాడాడు, ఏడవ ఏట, ఏడు రాత్రులు ఏడు పగళ్ళు గోవర్ధనగిరిని ఎత్తాడు.

**23. దశరథనందన గోవిందా :** అనగా దశరథ మహారాజు యొక్క కుమారుడని అర్థం. త్రేతాయుగంలో రావణ కుంభకర్ణాది రాక్షసుల సంహారం కొరకు శ్రీహరి దశరథునికుమారునిగా రామావతారాన్ని ధరించి ధర్మ సంస్థాపన చేశాడు. 1.పితృవాక్య పరిపాలన, 2.సౌభ్రాతృత్వం (అనగా అన్నదమ్ముల మధ్య ప్రేమ) 3.ఏకపత్నీ వ్రతం – అనగా ఒక భర్త, ఒకే భార్యను చేసుకొని వారి మధ్య ఉండవలసిన అన్యోన్యతను గురించి చాటి చెప్పటం. 4.ధర్మరక్షణ మున్నగు లక్షణాలను రామావతారంలో శ్రీహరి ఈలోకానికి చాటిచెప్పాడు.

**24. దశముఖ మర్దన గోవిందా :** దశముఖుడు అనగా రావణాసురుడు. శ్రీరాముడు రావణసంహారం చేశాడు కనుక దశముఖ మర్దనుడైనాడు. రావణాసురుని తమ్ముడైన విభీషణుడు శ్రీరాముని శరణు కోరాడు. మంచివాడైన విభీషణునికి రావణ సంహారానంతరం లంకా నగరానికి రాజుగా పట్టాభిషేకం చేశాడు.

25. **పక్షివాహనా గోవిందా :** పక్షిని వాహనంగా కలవాడు. గరుత్మంతుని వాహనంగా కలిగిన వాడగుటచేత శ్రీ మహావిష్ణువును పక్షివాహనా గోవిందా అని అంటారు.

26. **పాండవప్రియా గోవిందా :** అనగా పాండవులపై అమితమైన ప్రేమ కలిగినవాడు అని అర్థం. పాండురాజు కుమారులు 5 గురు. 1) ధర్మరాజు 2) భీముడు 3) అర్జునుడు 4) నకులుడు 5) సహదేవుడు. వీరిని పాండవులు అంటారు. వీరు ధర్మవర్తనులు. ఎన్ని కష్టాలు వచ్చినా ధర్మాన్ని వీడలేదు. భగవంతుడు ధర్మ పక్షపాతి కనుక శ్రీకృష్ణునికి పాండవులంటే అమితమైనప్రేమ.

27. **మత్స్యకూర్మా గోవిందా :** మత్స్యం అంటే చేప, పూర్వం సోమకాసురుడు అనే రాక్షసుడు వేదాలను దొంగిలించి సముద్రంలోకి వెళ్ళాడు. అపుడు శ్రీ మహావిష్ణువు మత్స్యావతారాన్ని ధరించి సోమకాసురుని వధించి వేదాలను తెచ్చి బ్రహ్మదేవునికిచ్చాడు. కూర్మం అనగా తాబేలు. దేవతలు, రాక్షసులు కలసి మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకి అను పామును త్రాడుగా చేసి పాల సముద్రంను చిలికేందుకు ప్రయత్నించగా మంధర పర్వతం సముద్రంలో మునిగిపోసాగింది. అలా మునగకుండా ఉండటానికి శ్రీ మహావిష్ణువు పర్వతం అడుగు భాగంలో తాబేలు రూపంలో ఉండి అమృతం ఆవిర్భవించేందుకు కారకుడైనాడు. అందుకే మత్స్యకూర్మ గోవిందా.

28. **మధుసూదనహరి గోవిందా :** మధు అనే రాక్షసుని సంహరించిన వాడు కనుక మధుసూధనుడని అంటారు.

29. **వరాహనృసింహా గోవిందా :** వరాహం అనగా పంది. వరాహ రూపములో భూమిని హిరణ్యాక్షుడనే రాక్షసుని నుండి రక్షించాడు.

నరసింహ అనగా సింహం తల, మెడ నుండి క్రింద పాదాల వరకు మనిషి ఆకారంలో ఉన్నవాడు. ప్రహ్లాదుని తండ్రి, రాక్షసరాజు అయిన హిరణ్యకశిపుని సంహారం కోసం శ్రీహరి నరసింహ రూపంను ధరించవలసి వచ్చింది.

30. **వామన భృగురామ గోవిందా :** వామనుడనగా పొట్టివాడు. బలి చక్రవర్తి నుండి మూడు అడుగుల భూమిని దానంగా తీసుకోవడానికి మహావిష్ణువు వామన రూపాన్ని ధరించాడు. ఒక అడుగుతో భూమి మొత్తాన్ని రెండవ అడుగుతో ఆకాశాన్ని మొత్తాన్ని ఆక్రమించాడు. మూడవ అడుగును బలి చక్రవర్తి శిరస్సుపై పెట్టి పాతాళ లోకానికి పంపించాడు.

31. **బలరామానుజ గోవిందా :** అంటే బలరాముని యొక్క తమ్ముడు–శ్రీకృష్ణుడు అని అర్థం. వసుదేవ మహారాజు భార్య రోహిణీదేవి. రోహిణి కుమారుడు బలరాముడు. దేవకి కుమారుడు శ్రీకృష్ణుడు. ఆ విధంగా శ్రీకృష్ణుడు బలరామునికి తమ్ముడైనాడు.

32. **బౌద్ధ కల్కిధర గోవిందా :** కలియుగంలో అధర్మం బాగా పెరిగినపుడు మానవులను ధర్మ మార్గంలో నడిపించేందుకు బుద్ధుడుగా జన్మించి, తన బోధల ద్వారా మానవులలో సత్ప్రవర్తన కలుగునట్లు చేశాడు శ్రీహరి. కల్కి అవతారం కలియుగం చివరలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసే శ్రీహరి అవతారం. కల్కి అవతారంలో హరి ఒక గుర్రంపై కూర్చొని కత్తిబట్టి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తాడు.

33. **వేణుగానప్రియ గోవిందా :** అనగా కృష్ణుడు పిల్లనగ్రోవితోచేసే గానం. అది వినిపించగానే గోపికలు మాత్రమే కాకుండా ప్రతివారు ఆ గానామృతాన్ని ఆస్వాదించి, మైమరచిపోయే వారట. ఇంకా గోవులు

కూడా వేణుగాన మాధుర్యాన్ని అనుభవించే వట. అందువలన శ్రీకృష్ణునకు వేణుగాన ప్రియుడు అని పేరు.

**34.** **వేంకటరమణా గోవిందా :** వేంకటాచలంపై నిలిచియున్న శ్రీ మహా విష్ణువు కనుక వేంకటరమణా గోవిందా అని అంటారు.

**35.** **సీతానాయక గోవిందా :** సీత అనగా నాగలి చాలు. జనక మహారాజు యజ్ఞవాటిక కొరకు నాగలితో భూమిని దున్నుతున్నప్పుడు ఒక పెట్టెలో లభించినశిశువు కనుక సీత అని పేరు. తల్లి గర్భం నుండి గాక శ్రీ మహాలక్ష్మి భూమి నుండి ఆవిర్భవించింది. ఆమె భర్త దశరథ కుమారుడైన రాముడు కనుక సీతానాయకుడైనాడు.

**36.** **శ్రిత పరిపాలక గోవిందా :** శ్రితులు అంటే భగవంతుని ఆశ్రయించిన వారు. తనను ఆశ్రయించిన వారి కోర్కెలను అడగకుండానే అనుగ్రహించేవాడు ఆ విష్ణుమూర్తి.

శ్రిత పరిపాలక గోవింద అంటే తనను ఆశ్రయించిన వారికి ఎల్లప్పుడు తోడుగా వుండి వారి కోర్కెలను తీర్చే శ్రీహరి.

సతీ సక్కుబాయి అను భక్తురాలు నిరంతరం శ్రీ పాండురంగని నామం జపిస్తూ, కీర్తనలను పాడుతూ, సర్వం ఆయన దయగా భావిస్తూ నిత్య కృత్యాలతో కాలం గడుపుతూ ఉండేది.

సక్కుబాయి అత్తగారికి ఏ మాత్రం ఎదురు చెప్పేదికాదు. అత్తగారు సక్కుబాయిని పాండురంగని మర్చిపొమ్మని చెప్తూ సరిగ్గా భోజనం పెట్టక ఎక్కువ శ్రమలు కల్గించే పనులు అనగా అధికంగా పిండి విసరటం, బావి నుండి నీళ్ళు తోడటం లాంటివి చెప్పి చాల బాధలు పెట్టేది.

ఒకరోజు గ్రామస్తులు పండరీపురం వెళ్ళుతున్నారు అని తెలిసి సక్కుబాయి కూడా వెళ్ళాలనుకుంది. అత్తగారు ఆమెను తాడుతో స్తంభానికి కట్టేసి పడుకుంది. అపుడు స్వామి ఆమె భర్త రూపంలో వచ్చి కట్లు విప్పి ఆమెను పండరీపురానికి పంపి, మళ్ళీ స్వామి సక్కుబాయిగా యింట్లో ఉండేవాడు. సక్కుబాయి పండరీ పురంలో స్వామి వారిని దర్శించి ఆనందంతో, తన్మయత్వంతో ఈ శరీరంను విడిచి స్వామిలో ఐక్యమైపోయింది. ఇది చూచిన గ్రామస్థులు ఇంటికి వచ్చి చెప్పగా పాండురంగడే సక్కుబాయిగా ఉన్న విషయాన్ని తెలుసుకొని స్వామిని శరణువేడారు. ఆశ్రితుల కోర్కెలను తీర్చాడు కనుక శ్రితపరిపాలక గోవిందా అని అంటారు.

**37. దరిద్రజనపోషక గోవిందా :** దరిద్రం అంటే ఆర్థిక సంపద లేక పోవడం. భగవంతుని నమ్మిన వారికి కావలసిన అవసరాలన్నీ ఆయనే తీరుస్తాడు. భక్త పోతనను అవమానించటానికి మహాకవి శ్రీనాథుడు అనేకమంది పండితులతో, స్నేహితులతో పోతన ఇంటికి భోజనానికి వస్తాడు. నిరుపేద స్థితిలో నున్న పోతన స్నానంచేసి రండి భోజనం తయారవుతుందని చెప్పి ధ్యానంలో కూర్చున్నాడు. భగవంతుడు ఆ వచ్చిన వారందరికీ సంతుష్టిగా భోజనం పెట్టి పంపించే ఏర్పాటు చేశాడు. అందుకే దరిద్ర జన పోషక గోవిందా అంటారు.

**మరొక ఉదాహరణ :**

కుచేలుడు, శ్రీకృష్ణుడు ఇద్దరూ సాందీప మహాముని యొక్క శిష్యులుగా గురుకులంలో ఉండి విద్యనభ్యసించారు. విద్యా భ్యాసం అనంతరం శ్రీకృష్ణుడు ద్వారకా నగరంలో రాజ భోగాలను అనుభవిస్తూ ఉండేవాడు.

కుచేలుడు శాంత స్వభావుడు, ధర్మమార్గ నిరతుడు, వివాహంచేసుకొని చాలా మంది పిల్లలను కని దుర్భర దారిద్ర్యంను అనుభవిస్తూ ఉండేవాడు. కుచేలుని భార్య ఒకసారి మీ బాల్య మిత్రుడైన శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళి ఏదైనా సహాయాన్ని అడగమని చెప్పింది.

పెద్దలవద్దకు, గురువుల వద్దకు, దేవుని వద్దకు, చిన్న పిల్లల వద్దకు వట్టి చేతులతో పోరాదు. కనుక భార్య ఇచ్చిన అటుకులను చినిగిన పై వస్త్రంలో మూటకట్టుకొని వెళ్ళాడు.

శ్రీకృష్ణుడు ఎదురువెళ్ళి కౌగలించుకొని తీసుకొని వచ్చి తన ప్రక్కన కూర్చోబెట్టుకొని, పాదాలు కడిగి ఆ జలాన్ని శిరస్సుపై చల్లుకొని బ్రాహ్మణోత్తముడైన కుచేలునకు సకల ఉపచారాలు చేశాడు.

మహారాజులకు సైతం దుర్లభమైన వాసుదేవుని యొక్క ఆలింగనం, ఆరాధనలను అందుకోగల్గిన విప్రోత్తముడు ఎంత ధన్యుడో గదా! నోట మాటరాక విప్రునితో, ఆప్యాయతతో కుశల ప్రశ్నలు వేసి స్వయంగా తాను అటుకుల మూట విప్పుకొని, తిని సాదరంగా సకల మర్యాదలు చేసి సాగనంపాడు.

శ్రీకృష్ణునికి తన దారిద్ర్యవిషయాన్ని గూర్చి చెప్పకుండానే కుచేలుడు ఇంటికి పయనమయ్యాడు. తాను తిరిగి రాగానే తన ఇంటి స్థానంలో పెద్ద భవనం, సకల సంపదలు, దాసదాసీలు, వస్తు వాహనాలతో కళకళలాడుతూండగా బయట నిలబడి చూడసాగాడు. భార్య ఎదురుగా వచ్చి (వామాక్షి) లోపలికి తీసుకు వెళ్ళింది.

అడుగకుండానే సకల సంపదలు ఇచ్చినవాడు శ్రీహరి. కనుకనే దరిద్రజనపోషక గోవింద అంటారు.

**38. ధర్మ సంస్థాపక గోవిందా :**

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానాం సృజామ్యహమ్ ॥**

భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు. అర్జునా.. ఎప్పుడెప్పుడు ధర్మం క్షీణించి అధర్మం వృద్ధిచెందుతుందో అప్పుడప్పుడు నన్ను నేనే సృష్టించుకొంటాను. (అవతరిస్తాను).

ధర్మో రక్షతి రక్షితః. ధర్మాచరణమే మనిషిని రక్షించ గలదు. ధర్మం నశించినపుడు ధర్మాన్ని ఉద్ధరించుటకు భగవంతుడు అనేక రూపాలలో భూమిపై అవతరిస్తాడు. కనుకనే ధర్మ సంస్థాపక గోవిందా అన్నారు.

**39. అనాథరక్షక గోవిందా :** అంటే అవసరమైన సమయాలలో, కష్ట సమయాలలో ఎవరి నుండీ సహాయం పొందలేని వారిని అనాధలు అంటారు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అన్నట్లు భగవంతుడు తనను నమ్మిన వారికి తప్పక రక్షగా ఉంటాడు. అందుచేతనే అనాధ రక్షక గోవిందా అన్నారు.

**40. ఆపద్బాంధవ గోవిందా :** అంటే ఆపద నమయాలలో తలుచుకోగానే భగవంతుడు బంధువువలె ఆదుకుంటాడు.

ఉదా: కౌరవులు, పాండవులు జూదం ఆడగా జూదంలో పాండవులు తమ భార్య అయిన ద్రౌపదిని కూడా ఓడిపోయారు. దుర్యోధనుని సోదరుడైన దుశ్శాసనుడు నిందుసభలో పెద్దలందరూ చూస్తూవుండగా

వివస్త్రను చేయటానికి ప్రయత్నించాడు. ద్రౌపది శ్రీకృష్ణపరమాత్మకు మొరపెట్టుకొనగా దుశ్శాసనుడు చీరెలు లాగి, లాగి అలసి పోయేలా చేశాడు తప్ప, ఆమెకు ఏ మాత్రం హాని జరుగనీయలేదు. కనుక భగవంతుని ఆపద్బాంధవుడంటారు.

**41. శరణాగతవత్సల గోవిందా :**

**చిక్కడు వ్రతముల క్రతువుల**
**చిక్కడు దానముల శౌచశీల తపములం**
**చిక్కడు యుక్తిని భక్తిని చిక్కిన క్రియ**
**అచ్యుతుండు సిద్ధము సుండీ.**

పై పద్యమును ప్రహ్లాదుడు గురుకులములోని తోటి పిల్లలకు చెప్తూ శ్రీమహావిష్ణువును ఏ విధంగా దర్శించగలమో చెప్తున్నాడు.

వ్రతాలు, యజ్ఞాలు, దానాలు, శుభ్రత, శీలత, తపస్సు, ఉపాయాల ద్వారా శ్రీహరిని దర్శించలేవు. ఏ పని చేసినా భక్తితో మాత్రమే చేస్తూ సర్వము శ్రీమన్నారాయణుని అనుగ్రహంగా భావిస్తూ ప్రతి పని యొక్క ఫలితాన్ని శ్రీహరికి అర్పిస్తూ నిమిత్త మాత్రునిగా తలచి నిరంతరం భక్తి శ్రద్ధలతో భగవంతుని స్మరిస్తే, శ్రీమన్నారాయణుని దర్శనం తప్పక లభిస్తుంది. (భక్తి కల్గిఉండడం ప్రధానం) కనుక మనం కూడా శ్రీహరికి నమస్కరించి ''స్వామీ! సర్వకాల సర్వావస్థలలోను మాకు తోడుగా ఉండి మమ్ములను నడిపించు" అని ప్రార్థించాలి.

శరణు కోరడం అంటే రక్షించమని ప్రార్థించటం. అలా శరణు వేడిన వారిని రక్షించడమన్న శ్రీమహా విష్ణువునకు మహా ప్రీతికరం.

రావణాసురుని తమ్ముడైన విభీషణుడు తన అన్నగారితో 'సీతను శ్రీరామునికి ఇచ్చి క్షమించమని అడుగు, దీని ద్వారా లంకా నగరాన్ని, రాక్షస జాతిని కాపాడు' అని ఎంత చెప్పినా రావణుడు వినలేదు. అన్నను వదలి విభీషణుడు శ్రీరాముని శరణు వేడినాడు. శత్రువు తమ్ముడైనప్పటికీ శ్రీరాముడు విభీషణుని చేరదీసి రావణ సంహారానంతరం లంకా పట్టణానికి రాజుగా నియమించాడు. ఆ విధంగా శరణాగతవత్సలుడు అయినాడు శ్రీరాముడు.

**42. కరుణాసాగర గోవిందా :** కరుణ అంటే దయకల్గి ఉండటం. సాగరం అంటే సముద్రమని అర్థం. సముద్రం యొక్క లోతు, విస్తీర్ణము చాలా ఎక్కువగా ఉంటుంది. అలాగే భగవంతుని యొక్క దయ కూడా మహా సముద్రంవలె చాలా విశాలంగా ఉంటుంది. కనుక భక్తులకు ఆయన కరుణాసాగరుడు.

పూర్వము అంబరీషుడు అను ఒక మహారాజు ఉండేవాడు. మనస్సును శ్రీమన్నారాయణుని పైనే లగ్నంచేసి నిత్య సత్యవ్రత పరాయణుడై కాలం గడిపేవాడు.

కార్తీక మాసంలో ఏకాదశి రోజున ఉపవాసంచేసి ద్వాదశి ఘడియలో తాను భోజనం చేసేందుకు సిద్ధమైనాడు. ఆ సమయంలో అక్కడకు దుర్వాస మహాముని వచ్చాడు. మహర్షికి తగిన మర్యాదలు చేసి భోజనానికి రావలసినదిగా కోరాడు. ఆయన అంగీకరించి యమునా నదికిస్నానానికి వెళ్ళాడు. ఎంత సేపైనా రాలేదు. ద్వాదశి ఘడియలు దాటుతున్నాయి. వ్రతఫలం వ్యర్థమయ్యేలా ఉంది ఏమి చెయ్యాలని విద్వజ్జనులను అడిగాడు. వ్రత ఫలం దక్కి, అతిథి మర్యాదకు లోపం కాకుండా తులసీ తీర్థం తీసుకోవడం శ్రేయస్కరం అని వారనగా అంబరీషుడు అలాగే చేశాడు.

మహర్షివచ్చి జరిగిందంతా గ్రహించాడు. అతనికంటె ముందుగా తీర్థం సేవించినందుకు కోపించి తన జట (వెంట్రుకలు) ఒకటి లాగి దానితో ఒక మహా రాక్షసిని సృష్టించి అంబరీషునిపై వదిలాడు. అది చూసి అంబరీషుడు నిశ్చలంగా శ్రీహరిని స్మరించాడు.

శ్రీహరి సుదర్శన చక్రంను పంపగా అది ముందుగా రాక్షసుని చంపి తరువాత దుర్వాసుని వెంబడించింది. దుర్వాసుడు వైకుంఠాన్ని చేరి శ్రీహరిని ప్రార్థించగా, 'మునీంద్రా సత్పురుషుల హృదయం నా నివాసం. నన్ను వారెరుగుదురు. నేను వారి నెరుగుదును. విప్రులు విద్యతో, తపస్సుతో, ముక్తి మార్గం సాధించాలి. దుష్టమార్గాలు త్రొక్కితే కీడు తప్పదు. అంబరీషుని వద్దకు వెళ్ళి శరణు వేడుకో ఆయన అనుగ్రహిస్తాడు' అని పంపాడు.

దుర్వాసుడు అంబరీషుని మన్నించమని ప్రార్థించగా ఆయన సుదర్శన చక్రంను అదృశ్య మవ్వవలసిందిగా కోరాడు. దుర్వాసుడు అంబరీషుని భక్తి తత్పరతను కొనియాడి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. భగవంతుడు భక్తులపై అపారమైన దయను కలిగి ఉంటాడు. కనుక కరుణాసాగర గోవిందా.

**43. కమలదళాక్ష గోవిందా :** కమల దళాలు అనగా తామర పూవుయొక్క రేకులు. అనగా విరిసిన తామర పూవుల రేకులవంటి విప్పారిన కన్నులు గలవాడు అని అర్థం. పువ్వులను చూడగానే మన మనస్సులు ఆహ్లాదం, ఆనందంతో నిండిపోతాయి. అటువంటి కన్నులు కల్గిన స్వామి యొక్క చల్లని చూపులు మనపై ప్రసరించగానే మన కష్టాలను, బాధలను మరచిపోయి ఆనందంగా ఉంటాము. అందువలన కమలదళాక్ష గోవిందా అన్నారు.

**44. కామితఫలదా గోవిందా :** కామిత ఫలదా అంటే కోరిన కోర్కెలు తీర్చేవాడు. కశ్యప ప్రజాపతికి ఇద్దరు భార్యలు. అదితి, దితి. (1) అదితి సంతానం ఆదిత్యులు (దేవతలు) (2) దితి సంతానము దైత్యులు (రాక్షసులు). రాక్షస వంశీయుడైన బలి చక్రవర్తి దేవేంద్ర పదవిలో ఉండి దేవతలను స్వర్గం నుండి వెళ్ళగొట్టాడు. తన వంశీయులందరు దారిద్ర్యంతో బాధపడకుండా ఉండటానికి అనేక దానధర్మాలు చేస్తూ ప్రజలకు సంతుష్టి కలిగించాడు.

దేవతల తల్లి అదితి తన కుమారుని గురించి విచారిస్తూ ఉంటే ఒక రోజు ధ్యాన సమాధినుండి కశ్యప ప్రజాపతి ఆమె వద్దకు వచ్చి 'ఎందుకు విచారిస్తున్నావు? వేదవేత్తలకు ఏ కష్టాలు రాకుండా దేవ పూజలకు అంతరాయం కలుగకుండా, వయస్సు వచ్చిన పిల్లలు పెద్దలను ఎదిరించకుండా, ఆకలిగొన్నవారిని ఆదరంతో చూస్తూ భోజనంపెట్టి తృప్తిపరుస్తుంటే ఏ ఆపదలూ రావు. మనకున్న దాంట్లో గుప్పెడు మెతుకులో, గుక్కెడు మజ్జిగనో ఎదుటి వారికి ఇవ్వకుండా ఎవడుంటాడో వాడికంటే దరిద్రుడు లేడు. వేద విధులు తృప్తిపడితే మహావిష్ణువు సంతోషిస్తాడు'అని పలికాడు. అదితి జరిగిందంతా భర్తకు వివరించి తన కుమారులకు దేవేంద్ర పదవి కావాలని కోరింది.

కశ్యప ప్రజాపతి చెప్పిన ప్రకారం అదితి 12 రోజులు ఆవుపాలను మాత్రమే ఆహారంగా తీసుకొంటూ నియమంతో ఆరాధించవలసిన పద్ధతిలో శ్రీమహావిష్ణువును ఆరాధించింది. ఆమె ఆరాధన ఫలించి శ్రీమన్నారాయణుడు వామన రూపంలో శ్రావణమాసం శ్రవణా నక్షత్ర ద్వాదశినాడు మధ్యాహ్నం ప్రభవించాడు.

వామనుడికి సప్త ఋషులు, ఉపనయనం జరిపించారు. సూర్యుడు గాయత్రి మంత్రం ఉపదేశించాడు. బృహస్పతి దండం ఇచ్చాడు. బ్రహ్మ కమండలం ఇచ్చాడు. సర్వస్వతి జపమాల ఇచ్చింది. కుబేరుడు భిక్షా పాత్ర ఇవ్వగా, పార్వతీదేవి పూర్ణభిక్ష పెట్టింది.

కొంతకాలానికి బలి చక్రవర్తి యజ్ఞం చేస్తుండగా వామనుడు మూడు అడుగుల నేలను దానం అడిగి దేవతలకు స్వర్గాన్ని ఇచ్చాడు. అదితి కోరిక తీర్చాడు. అందుకే కామిత ఫలదా గోవిందా...

**45. పాప వినాశక గోవిందా :** అంటే పాపం నుండి దూరం చేసేవాడు అనగా చేసిన పాపాలను పోగొట్టేవాడు అని అర్థం. ఉదా. గౌతమ మహర్షి భార్య అహల్యను శిలగా ఉండమని శపించాడు. శ్రీరాముని పాదధూళి తగలగానే అహల్యకు శాపవిమోచనం కలిగి మళ్ళీ అహల్యగా మారింది. అందుకే పాప విమోచన గోవిందా.

**46. పాహి మురారే గోవిందా :** మురారి అంటే మురాసురుడు అనే రాక్షసుని సంహరించినవాడు. దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించడం శ్రీమన్నారాయణుని యొక్క కర్తవ్యం కనుక పాహిమురారే గోవిందా.

**47. శ్రీముద్రాంకిత గోవిందా :** శ్రీ అనగా లక్ష్మీదేవి, లక్ష్మీదేవిని తన వక్షస్థలంపై ధరించిన వాడు కనుక శ్రీముద్రాంకిత గోవిందా.

**48. శ్రీవత్సాంకిత గోవిందా :** అనగా శ్రీవత్స లాంచనంను కలిగివున్న వాడు. భృగు మహర్షి శ్రీమహావిష్ణువును వక్ష స్థలంపై తన పాదంతో గట్టిగా తన్నగా విష్ణువు కోపింపక ఆయన యొక్క శ్రీపాదాలను భక్తితో పట్టి సేవించి ఆపాద చిహ్నాన్ని తన వక్షస్థలంపై ధరించాడని

పురాణగాథ. అందుకే శ్రీవత్సాంకిత గోవిందా. శ్రీవత్సం అను పుట్టుమచ్చ శ్రీహరికి త్రికోణాకారంలో తేనె రంగులో కుడి వక్షస్థలంపై ఉంటుంది.

**49. ధరణీనాయక గోవిందా :** భూనాయకుడు శ్రీనివాసుడు. వరాహ రూపంలో భూమిని కాపాడాడు. కనుక ధరణీనాయక గోవిందా అంటారు.

**50. దినకరతేజా గోవిందా :** దినకరుడు అంటే సూర్యుడు. సూర్యుడు స్వయం ప్రకాశ శక్తి కలవాడు. అలాగే గోవిందుడు కూడ సూర్యుని వలె మిక్కిలి తేజస్సుతో ప్రకాశిస్తూ, భక్తులకు ఆనందాన్ని కలుగజేస్తూ ఉంటాడు. అందుకే దినకరతేజా అంటారు. సూర్యుడు కుడి కన్ను, చంద్రుడు ఎడమకన్ను. సూర్య చంద్రుల ప్రకాశ శక్తి కలవారుగనుక దినకర తేజా గోవిందా..

**కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరిక్రియా**
**సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులున్**
**బ్రేమన్ మీరలు భక్తి నేము నిదె చక్రిం గంటి మెట్టైనను**
**ద్ధామధ్యాన గరిష్ఠుఁడైన హరిఁ జెందిన్ వచ్చుధాత్రీశ్వరా!**

రాజా! కామించి గోపికలు, విపరీతమైన భయంతో కంసుడు, వైర భావంతో శిశుపాలాదులు, బంధువులై యదువృష్ణి వంశాలవారు, ప్రేమతో మీవంటివారు, భక్తితో మేము ఆయన దర్శన భాగ్యం పొందుతున్నామని యుధిష్ఠిర మహారాజుకు నారద మహాముని చెప్పాడు.

కనుక శ్రీమహావిష్ణువును ప్రార్థించి మనం సకల శుభాలను పొందుదుముగాక.

**51. పద్మావతీప్రియ గోవిందా :** అంటే ఆకాశరాజ కుమార్తెను ఒక ఉద్యానవనంలో చూడగానే ఆమెను పరిణయమాడాలనే కోరిక కలిగి తన తల్లి వకుళమాత సహాయంతో పరిణయమాడి ఆమె యందు ప్రేమానురాగాలను కలిగియున్నవాడు శ్రీనివాసుడు అందుకే పద్మావతీ ప్రియ అన్నారు.

**52. ప్రసన్నమూర్తి గోవిందా :** ప్రసన్నమూర్తి అనగా ప్రశాంతమైన చిరునవ్వుతో ఉండేవాడు. భక్తులు భక్తితో ప్రార్థించినపుడు ప్రత్యక్షమవడం. శ్రీ వేంకటేశ్వరుడు మందస్మిత వదనంతో ఉండటమేగాక భక్తుల కోర్కెలను తీరుస్తున్నాడు. కనుక ప్రసన్నమూర్తి గోవిందా అంటారు.

**53. అభయహస్తప్రదర్శన గోవిందా :** అభయం, అనగా భయాన్ని పోగొట్టేది. ఎటువంటి, ఏ రకమైన, ఎవరివలనైనా సరే భయం కల్గినపుడు ఆ దేవదేవుని మనసారా స్మరించి తన భయాన్ని చెప్పుకోగానే స్వామి తన అభయ హస్తాన్ని చూపి ధైర్యాన్ని ప్రసాదించి కోర్కెలను తీరుస్తాడు. స్వామివారి కుడిచేతిలో అభయహస్తం చూపడం లోని ఆంతర్యం ఇదే.

**54. మత్స్యావతార గోవిందా :** అనగా శ్రీ మహావిష్ణువు చేప రూపము దాల్చుట. పూర్వం సత్యవ్రతుడు అనే రాజు ధర్మబద్ధంగా రాజ్య పాలన చేస్తూ ఒక సం॥ర కాలం నీరే ఆహారంగా తీసుకొంటూ శ్రీహరి ధ్యానంలో గడిపాడు. ఒకనాడాయన నదీ స్నానం చేసి హరి ప్రీతిగా జలతర్పణం చేసే సమయములో ఆయన దోసిలిలో ఒక చిన్న చేపపిల్ల కనుపించింది. వెంటనే ఆయన ఆ చేప పిల్లను

నదిలో వదిలాడు. అప్పుడు ఆ చేప పిల్ల రాజా! ఈ నదిలో పెద్ద చేపలు, చిన్న వాటిని కబళిస్తాయి నన్ను రక్షించమంది.

ఆ రాజు అప్పుడు చేపపిల్లను తన కమండలంలో వేసుకొని ఇంటికి వచ్చెను. తెల్ల వారేసరికి ఆ చేప నాకు ఈ పాత్ర చాలలేదు అన్నది. అపుడు రాజు చేపను మరో పాత్రలో ఉంచాడు. వెంటనే ఆ పాత్ర కూడా చాలలేదు. తదుపరి కొలనులో ఉంచాడు. వెంటనే ఆ కొలను కూడా చాలలేదు. చేప చాలా పెద్దగా అయింది. సముద్రంలో వదిలాడు. అపుడు ఆ చేప రాజా! నన్ను మొసళ్ళ గుండంలో వదిలి వెళతావా అంది. అపుడు సత్యవ్రతుడు క్లేశంలో ఉన్న భక్తులను రక్షించటానికి ఈ అవతారం ధరించిన శ్రీహరీ నీకు నమస్కారం. ఈ అవతార కారణం తెలుసుకోవాలని ఉంది అనగా శ్రీమన్నారాయణుడు "రాజా! నేటికి 7 రోజులలో బ్రహ్మకు పగలు కావస్తున్నది. అపుడు ప్రళయం వస్తుంది. అపుడొక పెద్ద నావ వస్తుంది. దానిలో సర్వబీజాలు, ఓషధులు నింపి నువ్వు ఈ జలరాశిలో తిరుగుతూ ఉండు. అందులోనే సప్తర్షులూ నీతో ఉంటారు. దాని రక్షణభారం నాది. అందుకే ఈ అవతారం ధరించాను." అని పలికి శ్రీహరి అదృశ్యమయ్యాడు.

7వ రోజు బ్రహ్మ నిద్రలో ఉండగా వేదాలను సోమకాసురుడు అపహరించి సముద్రంలోనికి వెళ్ళాడు. అందరూ కూర్చున్న ఆ నావకు శ్రీహరి రక్షణ కల్పించి సోమకాసురుని చంపి వేదాలను తెచ్చి బ్రహ్మకిచ్చాడు. ఆ సత్యవ్రతుడే ఈ కల్పంలో వివస్వతుడు అనే పేర వెలిగే సూర్యుని కుమారునిగా పుట్టి వైవస్వతమనువుగా ప్రఖ్యాతుడయ్యాడు. అందుకే మత్స్యావతారా గోవిందా అంటారు.

**55. శంఖ చక్రధర గోవిందా :** శ్రీ మహా విష్ణువు పాంచజన్యమనే పేరుగల దివ్య శంఖంను ధరించాడు. పాంచజన్యం పంచేంద్రియాలకు వాటికధిపతి అయిన మనస్సుకు చిహ్నం. అహంకారానికి మనస్సు నిలయం. కనుక శంఖం అహంకారతత్వంను సూచిస్తుంది. చక్రధర అనగా సుదర్శనమను చక్రాన్ని ధరించిన వాడగుటచే శ్రీపతి చక్రి అని పిలువబడుతున్నాడు.

సుదర్శనమనగా శుభదృష్టిని సూచిస్తున్నది. మానవుని చిత్తవృత్తిని సూచిస్తున్నది. శంఖచక్రధర అంటే అహంకారాన్ని తొలగించి శుభదృష్టిని ప్రసాదించేవాడని అర్థం. కనుక శ్రీహరిని శంఖచక్రధర గోవిందా అంటారు.

**56. శార్‌ఙ్గ గదాధర గోవిందా :** శార్‌ఙ్గమను పేరుగల ధనస్సును శ్రీహరి ధరించాడు. ఇదికూడా మానవుని అహంకార తత్వంను సూచిస్తుంది.

గధా ధర కౌమోదకీ అను పేరుగల గధను ధరించినవాడు శ్రీహరి. కౌమోదకం అనగా ఆనందంను కలిగించేది అని అర్థం. ఇది బుద్ధితత్వాన్ని సూచిస్తుంది. అందుచే శార్‌ఙ్గగధాధర గోవిందా అన్నారు.

**57. విరజా తీరస్థ గోవిందా :** విరజానది అనగా గంగానది. వైకుంఠంలో శ్రీహరి పాదాలనుండి ఉద్భవించిన ఆకాశగంగకే విరజ అని పేరు.

రామదాసుగా ప్రసిద్ధిగాంచిన కంచర్ల గోపన్న భద్రాచలంను ఇలా వర్ణించారు.

**శ్రీరమ సీతగాగ, నిజ సేవక బృందము, వీర వైష్ణవా**
**చార జనంబుగాగ, విరాజానది గౌతమిగా వికుంఠము**
**న్నారయ భద్రశైల శిఖరాగ్రముగాగ, వసించు చేతనో**
**ద్ధారకుడైన విష్ణువుడవు దాశరథీ కరుణాపయోనిధీ.**

అనగా: దశరథరామా! నీవు వైకుంఠమందున్న లక్ష్మీదేవిని ఇచ్చట సీతగా, అక్కడి నీ భక్తులు ఇక్కడ వీరవైష్ణవ జనులుగా వచ్చి పూజిస్తుండగా, అక్కడి విరజానది ఇక్కడ గోదావరిగా ప్రవహించగా ఆ వైకుంఠమే ఇక్కడ భద్రగిరి శిఖరంగా మారగా వేంచేసి ప్రాణికోటిని ఉద్ధరిస్తున్న నీవు ఆ మహా విష్ణువే కాని వేరుకాదు అంటాడు. కనుక విరజాతీరస్థ అంటే గోదావరి ఒడ్డునవున్న శ్రీ మహావిష్ణువైన శ్రీరాముడే అని ఒక అర్థం. అలాగే తిరుమల శ్రీవారి ఆలయం ప్రక్కనున్న స్వామి పుష్కరిణిలో విరజా తీర్థంతో పాటు అనేక తీర్థాలు నెలవై ఉంటాయని బ్రహ్మాండాది పురాణాలు చెప్తున్నాయి. విరజా తీర్థ ప్రవేశం ఉన్న స్వామి పుష్కరిణి తీరాన గోవిందుడు కొలువైవున్నాడు కనుక విరజాతీరస్థ గోవింద అంటారు. వైకుంఠంను చేరుటకు విరజానదిని దాటాలి.

**58. విరోధి మర్దన గోవిందా :** విరోధులు అనగా శత్రువులు. భగవంతునికి అందరూ సమానమే కదా. మరి శత్రువులు ఎవరుంటారు. అంటే ధర్మానికి విరుద్ధంగా నడిచేవారు, సజ్జనులను బాధించేవారు, సత్ క్రియలకు ఆటంకం కలిగించేవారు, వేడుకగా జంతు హింస చేసేవారు, పతివ్రతలను కామించేవారు, సాధుశీలురను హింసించే వారు వీరంతా శ్రీహరికి శత్రువులే.

పతివ్రత అయిన సీతను అపహరించి లంకలో ఉంచిన రావణాసురుడు దేవకీ వసుదేవులను చెరసాలలో బంధించి వారికి పుట్టిన బిడ్డలను పుట్టగానే చంపిన కంసుడు లాంటి వాడు. ధర్మ మార్గంలో నడుచు ప్రతి వారిని రక్షించుటకు స్వామి విరోధి మర్ధనుడుగా అవతరిస్తాడు.

**59. సాలగ్రామధర గోవిందా :** అనగా సాలగ్రామ శిలారూపంను ధరించినవాడు. శ్రీమహావిష్ణువు ఏడుకొండలపై సాలగ్రామ శిలారూపంలో శ్రీనివాసునిగా కొలువైఉన్నాడు. సాలగ్రామాలు శ్రీమహావిష్ణు స్వరూపాలు. ఇవి గండకీ నదిలోనే లభిస్తాయి.

**60. సహస్రనామా గోవిందా :** సహస్ర అనగా వెయ్యి, నామాలు అనగా పేర్లు. వెయ్యి పేర్లు గలవాడని అర్థం. కాని శ్రీహరి అనంత నామాలు అనంత రూపాలు గలవాడు. రూపంకంటే నామం గొప్పది. నామస్మరణం వలన మహాత్ములు దైవదర్శనం చేసుకోగలిగారు.

విష్ణు సహస్రనామ స్తవంలో (స్తుతించుట) దేవ, మనుష్య, జంతు, పక్షి, వృక్ష, లత, ఋతు, గ్రహ, నక్షత్ర, కాల, యుగ, ధాతు, గుణాలన్నిటిని విష్ణుస్వరూప దివ్యనామాలతో గానం చేయడం గమనార్హమైనది.

శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ ఫలం అనంతం, దీని వలన కలిగే లౌకిక ప్రయోజనాలు అనేకం.

సకల శుభాలను ప్రసాదించు దివ్యస్థవం ఇది. కనుక సహస్రనామా గోవిందా అంటారు.

ఏడుకొండలవాడా గోవిందా.. అనాథ రక్షక గోవిందా..

**సర్వేశుడు, సర్వాత్ముడు**
**సర్వగతుండచ్యు తుండు**
**సర్వమయుండై సర్వంబు చేరి కొలువగ**
**సర్వగుడై దక్షునకు ప్రసన్నుండయ్యెన్**

అనగా సర్వమునకు అధిపతియైన వాడు. అందరి ఆత్మలలో ఉండేవాడు. ఎక్కడికైనా వెళ్ళగలిగేవాడు, నాశనం లేని వాడు, అనగా

ప్రతి కాలంలోనూ ఉండేవాడు, సర్వం తానే అయినవాడు, అందరూ చేరి ప్రార్థిస్తుండగా దక్ష ప్రజాపతికి ప్రత్యక్షమై ఇలా చెప్పాడు.

దక్ష ప్రజాపతీ ! సంధ్యావందనమనే తపస్సు నా హృదయం, ధ్యాన జపమే నా శరీరము, శబ్దమే నా ఆకారం, సత్క్రతువులే నా అవయవాలు, ధర్మమే నా ఆత్మ, దేవతలు నా ప్రాణాలు, వేదాలు నా రూపం అని తెలిపాడు.

కనుక సంధ్యా వందనం చేస్తూ, జపం చేస్తూ ఓంకారంను పలుకుతూ, యజ్ఞయాగాదులను చేస్తూ ధర్మ మార్గంలో నడుస్తూ, దేవతలను ఆరాధిస్తూ, వేద జ్ఞానంను గూర్చి తెలుసుకొంటూ శ్రీహరి కృపకు పాత్రులం కాగలము. కనుక మనం సర్వదా శ్రీహరి కథలను వింటూ నామస్మరణ చేస్తూ శ్రీమన్నారాయణుని దయ మనపై ఎల్లపుడు ప్రసరించాలని కోరుకుందాం.

61. **లక్ష్మీవల్లభ గోవిందా :** అనగా శ్రీమహాలక్ష్మి భర్త అయిన శ్రీ మహా విష్ణువని అర్థం. లక్ష్మి అనగా సంపద. సంపద అనగా డబ్బు మాత్రమే కాదు. (1) ధనలక్ష్మి అనగా డబ్బు. (2) ధాన్య లక్ష్మి అనగా పంటలు. ఎంత డబ్బు ఉన్నా పంటలు లేకపోతే మనం డబ్బు, బంగారం తిని బ్రతకలేం కదా! మన ప్రాణాలను నిలిపే ఆహారం పంటలవలన మాత్రమే లభిస్తుంది. కనుక ధ్యానలక్ష్మి అంటారు. (3) సంతానలక్ష్మి: అనగా పిల్లలు కల్గుట. ప్రతి జాతి తన వంశాభివృద్ధికొరకు పిల్లల్ని కనాలి. పిల్లలు కలుగక పోతే కొంత కాలానికి ఆ జాతి కనుపించదు. అవి జంతువులు కాని, మనుష్యులు కాని, పక్షులుగాని, ప్రాణమున్నవి ఏవైనా సరే తమ ప్రతి రూపాలను సృష్టించక పోతే కొంతకాలానికి ఆ జాతి నశిస్తుంది. కనుక సంతానం కలిగి ఉండడం అవసరం.

(4) విద్యా లక్ష్మి : అనగా ఒక్క అక్షర జ్ఞానం మాత్రమే కాదు మనకు 64 కళలు ఉన్నాయి. అందులో సంగీతం, నాట్యం, చిత్ర లేఖనం, ధనుర్విద్య అనగా అస్త్ర ప్రయోగం, ఈ కళల సాధన ద్వారా పొందటాన్ని ఆయా విద్యల పేర్లతో పిలుస్తారు. కనుక అన్ని విద్యలు కూడా శ్రీ మహాలక్ష్మి రూపాలే. (5) ధైర్యలక్ష్మి: అనగా ధైర్యంకల్గి ఉండుట. పిరికివాడు ఏ పని చేయలేడు. ధైర్యవంతుడు ఎన్ని కష్టాలు వచ్చినా ఆ పనిని మధ్యలో వదలి పెట్టకుండా సాధించే ఉత్తముడు.

కార్యసాధనలో సాధ్యాసాధ్యాలు, కష్ట సుఖాలు, ఆహార విహారాలు, సుఖభోగాలు వీనిని గురించి కార్య సాధకుడు అస్సలు ఆలోచించడు. కార్యసాధన లక్ష్యమే అతనికి కనిపిస్తుంది. అందుకే ధైర్య, సాహసాలు, లక్ష్మీ స్వరూపాలు. (6) సౌభాగ్యలక్ష్మి: సౌభాగ్యం అనగా ముత్తైదువ అయిన స్త్రీకి తప్పనిసరిగా ఉండవలసినవి. 1. మాంగల్యం 2. పూవులు 3. కాలి మెట్టెలు 4. గాజులు కాలికి పట్టీలు 5. పసుపు, కుంకుమ మొదలైనవి.

సౌభాగ్యవతియైన స్త్రీ నిరంతరం తన భర్త యొక్క కుటుంబం యొక్క క్షేమం కొరకు అనేక పూజలు, వ్రతాలు చేస్తూ దేవుని కృపను పొందుతుంది. కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా గృహిణి సంతోషంగా ఉండాలి. ఎక్కడ స్త్రీ పూజింప బడుతుందో అక్కడ దేవతలు నివసిస్తారని ఆర్యోక్తి. నిత్య సంతోషియైన స్త్రీ నడయాడే ప్రదేశం లక్ష్మీ స్థిరనివాసంగా ఏర్పడుతుంది.

(7) జయలక్ష్మి అనగా విజయం పొందడం. శాశ్వతమైన విజయం సంపాదించడం ఎపుడైనా సరే ధర్మమార్గంలో నడిచే వారికి మాత్రమే

సాధ్యపడుతుంది. అధర్మ మార్గంలో విజయం సాధించినప్పటికీ అది కొంతకాలం మాత్రమే ఉంటుంది. 'కల'లో విషయాలు మాయమై పోయినట్లు పోతాయి. కాబట్టి శాశ్వతమైన విజయాన్ని పొందడం విజయలక్ష్మి స్వరూపం.

(8) మోక్షలక్ష్మి అనగా మోక్షంను పొందడం అనగా పునర్జన్మ లేకుండా శ్రీహరిలో ఐక్యత చెందడం. మానవుడు నిరంతరం శ్రీహరిని ధ్యానం చేస్తూ, తామరాకుపై నీటిబొట్టులా సంసారసుఖాలను పొందుతూ అంత్యకాలంలో పరమేశ్వరునిలో ఐక్యంకావడాన్నే మోక్షలక్ష్మి అంటారు.

పై విధంగా ఏ లక్ష్మీ రూపమైనా సరే శ్రీమన్నారాయణునికి భార్యగా ఉంటుంది. అనగా లక్ష్మిపై అధికారం ఆ శ్రీహరికి మాత్రమే ఉంటుంది. కనుక మనం శ్రీమహా విష్ణువును నమ్మి కొలిచినట్లైతే మనకు ఏ ఏ సమయాలలో ఏ ఏ అవసరాలు కలిగినా పరమాత్ముడైన శ్రీహరి తన భక్తులకు కోరకుండానే కోర్కెలను తీరుస్తాడు. కనుక మనం సర్వదా శ్రీమన్నారాయణుని సేవలో గడిపి జన్మ సాఫల్యం చేసుకొందాం.

పైన చెప్పినవన్నీ విని, ఆచరిస్తే, మోక్షాన్ని పొందుతారు.

**62. లక్ష్మణాగ్రజ గోవిందా :** అనగా లక్ష్మణుని యొక్క అన్న అనగా శ్రీరాముడు. పూర్వం భూమిపై అధర్మం పెచ్చు పెరిగినపుడు భూదేవి శ్రీమన్నారాయణుని వద్దకు వెళ్ళి ఈ భూభారాన్ని నేను మోయలేక పోతున్నానని ధర్మ సంస్థాపన చేయవలసినదని మొరపెట్టు కొన్నది. రాక్షస సంహారంచేసి ధర్మాన్ని పరిరక్షించేందుకు తాను శ్రీరామునిగా జన్మిస్తానని శ్రీమన్నారాయణుడు భూదేవికి చెప్పి పంపాడు. అయోధ్యను పరిపాలించే దశరథ మహారాజుకు ముగ్గురు భార్యలు.

కౌసల్య, సుమిత్ర, కైకేయి, ముగ్గురు భార్యలకు పిల్లలు లేని కారణంగా సంతానం కోసం పుత్రకామేష్టి యాగం చేశాడు. దాని ఫలితంగా రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు అను పిల్లలు కలిగారు. శ్రీరాముడు కౌసల్యా తనయుడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే. లక్ష్మణుడు సుమిత్ర గర్భంన జన్మించాడు. ఈయన ఆదిశేషుని అవతారం. అందుకే లక్ష్మణాగ్రజ గోవిందా అన్నారు.

**63.** **కస్తూరి తిలక గోవిందా :** అనగా కస్తూరి తిలకంను ధరించినవాడని అర్థం. కస్తూరి జింక బొడ్డు నుండి వస్తుంది.

**64.** **కాంచనాంబరధర గోవిందా :** బంగారు వస్త్రాలను ధరించిన వాడని అర్థం.

**65.** **గరుడ వాహన గోవిందా :** అనగా గరుత్మంతుడు విష్ణుమూర్తి యొక్క వాహనము. కనుక గరుడ వాహన గోవిందా అంటారు.

**66.** **గజరాజ రక్షక గోవిందా :** అనగా ఏనుగుల యొక్క రాజును రక్షించిన వాడు అని అర్థం. త్రికూటం అనే అతి విశాలమైన పర్వతం ఉంది. దానికి శిఖరాలు మూడు. ఒకటి బంగారు కాంతితో రెండవది ఇనుము కాంతితో మూడవది వెండికాంతితో ప్రకాశిస్తూ వుంటాయి.

ఆ కొండపైన అడవి మృగాలతో పాటు ఎన్నో వేల ఏనుగులు కూడ ఉన్నాయి. ఒక గజరాజు, కొన్ని ఆడ ఏనుగులు గుంపులో నుండి చీలిపోయాయి. అవి ఒక చక్కని సరోవరం చూసి సంతోషంతో సరోవరంలో దిగి హాయిగా జలక్రీడలు సాగించాయి. గజేంద్రుడు తొండం నిండా నీరు పీల్చి ఆకాశవీధిలోకి చిమ్ముతుంటే ఆ వేగానికి జల చరాలన్నీ పైకి ఎగిరి పోతున్నాయి.

ఒక్కసారిగా సరోవరం మధ్యలో నుండి ఒక పెద్ద మొసలి వచ్చి గజేంద్రుని కాలు పట్టింది. ఒకదాని నొకటి పీడిస్తూ సరోవరం అంతా కలియదిరుగుతున్నాయి. నీరు నివాస స్థానమైన మొసలికి బలం పెరిగింది. ఏనుగుకు నీరసం వచ్చింది. మొసలి నుండి తప్పించుకోవడం తన వలన కాదని నిశ్చయించుకొన్నది. అప్పుడు గజరాజు సర్వశక్తులుడిగి అన్ని ప్రయత్నాలు విరమించి అఖిలలోక రక్షకుడైన నారాయణుని ప్రార్థించే సమయాన, ఆ జగద్రక్షకుడు వైకుంఠంలో కేళీ మందిర సమీపంలో మందార వన మధ్యలోని సరోవర తటాన చంద్రకాంత శిలా వేదికపై హంసతూలికా తల్పంమీద లక్ష్మీదేవితో సరస సల్లాపాలాడుతున్న వాడు, ఆడుతున్నట్లే బయలుదేరాడు. ఎలా బయలు దేరాడంటే...

**మ. సిరికిం జెప్పఁడు; శంఖచక్ర యుగముం జేదోయి సంధింపఁ డే**
**పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం**
**తర ధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాదప్రోత్థిత శ్రీకుచో**
**పరి చేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.**

లక్ష్మీదేవికి జెప్పలేదు, శంఖచక్రాలు ధరించలేదు. పరి వారాన్ని పిలువలేదు. తన వాహనమైన గరుత్మంతుని రమ్మనలేదు. చెవుల మీద చిందర వందరగా పడుతున్న ముంగురులను సవరించలేదు. సరస సల్లాపాలాడే వేళ పట్టుకున్న లక్ష్మీదేవి పైట చెంగు కూడ వదలకుండా బయలుదేరాడు.

ఇంకేముంది.. ఆయన వెను వెంట లక్ష్మీదేవి, ఆవిడతో అంతః పుర పరివారం, వెనుకనే గరుత్మంతుడు, శంఖచక్రగధాశార్ఙ్గాలు, నారదుడు, విష్వక్సేనుడు, వారితోపాటు నగరంలోని ఆబాల గోపాలం బయలుదేరారు.

శ్రీహరి సరస్సు వద్దకు వెళ్ళి సుదర్శన చక్రం ప్రయోగించిన వెంటనే అది మొసలి తలను ఖండించింది. వెంటనే దేవలుని శాపంవల్ల మకరి జన్మఎత్తిన హూ, హూ అనే గంధర్వుడు, శ్రీమన్నారాయణుని వలన శాపవిముక్తుడై గంధర్వరూపంలో వెళ్ళిపోయాడు.

నారాయణుడు గజేంద్రుని తన కరస్పర్శతో అనుగ్రహించాడు. ఇంద్రద్యుమ్నుడనేరాజు అగస్త్యమహర్షిని ఉదాసీనంగా చూసిన కారణంగా ఏనుగు జన్మనెత్తి ఈవిధంగా శాపవిముక్తుడై, వైకుంఠం చేరాడు.

**ప. గజరాజ మోక్షణమును**
**నిజముగ పఠియించునట్టి**
**నియతాత్ములకున్, గజరాజ వరదుడిచ్చును.**
**గజ, తురగ, స్యందనములు, కైవల్యంబున్.**

కనుక గజరాజ రక్షకుడైన శ్రీమన్నారాయణుడు మనలను సర్వకాల సర్వావస్థలలో రక్షించునుగాక.

**67. వానరసేవిత గోవిందా :** అనగా కోతులచే సేవించబడినవాడని అర్థం. శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు దండకారణ్యంలో ఉండగా, రావణాసురుడు మాయోపాయంతో సీతను లంకకు తీసుకొని వెళ్ళాడు. శ్రీరాముడు లక్ష్మణుడు సీతాన్వేషణ చేస్తూ ఋష్యమూక పర్వత ప్రాంతానికి రాగా, వానరరాజు హనుమంతుని వారివద్దకు పంపాడు. హనుమంతుడు శ్రీరామునితో వాలి, సుగ్రీవుల విషయం అంతా చెప్పి సుగ్రీవునకు సహాయం చేయమన్నాడు. శ్రీరాముడు ఆ విధంగా వాలిని సంహరించి సుగ్రీవునికి పట్టాభిషేకం చేశాడు.

వానరులందరూ సీతాన్వేషణలో పాల్గొన్నారు. లంకా నగరంలో సీత ఉన్న విషయాన్ని హనుమంతుని ద్వారా శ్రీరాముడు తెలుసుకొని, సుగ్రీవుడు, అంగదుడు, జాంబవంతుడు, హనుమంతుడు మొదలగు వానరసైన్యంతో కలసి లంకా నగరంపై దండెత్తి రావణసంహారం గావించాడు.

ఇలా వానరుల నుండి సేవలు అందుకున్న వాడు కనుక వానర సేవిత గోవిందా అంటారు.

శ్రీరామ పట్టాభిషేక సమయంలో సీతాదేవి ఆంజనేయునికి ఒక విలువైన రత్నాల హారంను బహూకరించింది. హనుమంతుడు ఆ హారంలోని రత్నాలను ఒకదానిని నోటితో కొరికి, వాసన చూచి, చెవి వద్ద పెట్టుకొని వివిధ రకాలుగా పరిశీలించి హారంను విసిరివేశాడు. దీనిని గమనించిన సీత హనుమా, నీవు ఏమి చేస్తున్నావు. అంత విలువయిన హారాన్ని పాడుచేశావు. ఏమిటీ పని అని అడిగింది.

అమ్మా! నన్ను మన్నించండి. మీరు ఇచ్చిన హారంలో ఎక్కడైనా శ్రీరామ శబ్దం కనిపిస్తున్నదా, వినిపిస్తున్నదా, రామనామామృత రుచి కలిగి వున్నదా! అని వివిధ రకాలుగా వెతికి చూశాను. నాకు రామనామం లేని వస్తువు ఏ మాత్రం విలువైనది కాదు. అందువలన దానిని విసిరివేశాను అని చెప్పాడు.

శ్రీరాముడు చిరునవ్వుతో హనుమను దగ్గరకు తీసుకొని, ఆలింగనం చేసుకొని నిరంతరం నీ హృదయ స్థానమే మా నివాసం అని చెప్పాడు. కనుక వానర సేవిత గోవిందా.

68. **వారధిబంధన గోవిందా :** అనగా వారధిని నిర్మించిన వాడు అని అర్థం. లంకా నగరం ప్రస్తుతం శ్రీలంకగా పిలువబడుతున్నది. రావణుడు సీతను లంకలో ఉంచిన విషయం తెలిసిన తరువాత లంకను చేరడానికి మధ్యలో ఉన్న హిందూ మహాసముద్రం పైన ప్రస్తుత ధనుష్కోటి ప్రాంతం నుండి శ్రీలంక వరకు వానరుల సాయంతో వారధిని నిర్మించాడు. కనుక వారధిబంధన గోవిందా అన్నారు.

69. **ఏడు కొండలవాడా గోవిందా :** అంజనాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి, శేషాద్రి, వెంకటాద్రి, గరుడాద్రి అనేవి ఏడుకొండలు. ఏడు కొండల పైభాగంలో శ్రీమన్నారాయణుడు శ్రీనివాసునిగా వెలిశాడు కనుక ఏడు కొండలవాడా గోవిందా అన్నారు.

70. **ఏకస్వరూపా గోవిందా :** ఏక అనగా ఒక, స్వరూపం అనగా ఆకారం కలిగినవాడు అని అర్థం. దేవునికి అసలు ఆకారం ఉన్నదా! లేదా! ఉంటే ఏ ఆకారం. మనిషా? జంతువా? స్త్రీయా? పురుషుడా, ఏ పేరుతో పిలవాలి. ఏకంసత్ ఏ పేరుతో పిలవాలి.

మానవ ఆకారంలో ఉన్న రాముడు, కృష్ణుడు, జంతువు ఆకారంలో ఉన్న గోమాత, స్త్రీ ఆకారంలో వున్న లలితా పరమేశ్వరి ఇంకా ఇతర దేవతా స్త్రీమూర్తులు, పక్షి ఆకారంలో నున్న గరుడుడు, పాము ఆకారంలోనున్న నాగేంద్రస్వామి అందరూ దేవతలే మరి ఏక స్వరూపా అంటే ఏమిటి?

ఏ మతం వారైనా ముందుగా దేవతారాధనతోనే పనిని మొదలు పెడతారు. అనగా జ్యోతిని వెలిగించి ప్రార్థిస్తారు. జ్యోతివెలుగును ప్రసాదిస్తుంది. వెలుగు తన కాంతితో చీకటిని పారద్రోలుతుంది.

జ్ఞాన జ్యోతి అనే వెలుగు అజ్ఞాన తిమిరాలను పోగొడుతుంది. జ్ఞానంను ప్రసాదించే వెలుగే భగవంతుడు.

ఒక వ్యక్తిని ఒకరు 'అన్నా' అని, ఇంకొకరు 'నాన్నా' అని మరొకరు 'తాతా' అని పిలిచినా ఆ వ్యక్తి మాత్రం ఒక్కడే.

దేవునికి వివిధ రూపాలు, వివిధ నామాలు మన ఇష్టాన్నిబట్టి మనం ఏర్పరచుకొన్నవే. ఎవరు ఏ పేరుతో పిలిచినా జ్ఞానజ్యోతి నుండి వెలువడే వెలుగే దేవుడు. సచ్చిదానంద స్వరూపుడు.

ఆ సర్వేశ్వరుడు, సర్వులను, సర్వకాల సర్వావస్థలయందు మన వారందరికీ తోడుగా ఉండి నడిపించుగాక!

**71. శ్రీరామకృష్ణా గోవిందా :** శ్రీరాముడైన, కృష్ణుడైనా, వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణ స్వరూపమే.

భూమిపై రాక్షసులు, మహర్షులను, సాధు జనులను బాధిస్తుండగా రాక్షస సంహారానికై శ్రీహరి దశరథమహారాజు కుమారునిగా భూమిపై అవతరించి రాక్షస సంహారం గావించాడు.

శ్రీకృష్ణుడు నందరాజు కొడుకైనా కూడ ఏ మాత్రం అహంకారం లేకుండా గోవులను కాయటం, తోటి పిల్లలతో సమంగా ఆటలాడడం, భుజించడం వంటి చర్యల ద్వారా అందరూ సమానమే అనే అంశాన్ని చూపించాడు.

శ్రీకృష్ణుడు రెండు గానాలను చేశాడు. 1) వేణుగానం : పిల్లన గ్రోవిని ఊది అందరి మనస్సులను ఆనంద డోలికలలో ఊగునట్లు చేశాడు. 2) గీతాగానం: అనగా భగవద్గీతను బోధించుట. అర్జునుడు కౌరవ సైన్యమును చూచి అందరూ నా బంధువులు, గురువులు,

స్నేహితులు, సోదరులు, వారితో నేను యుద్ధం చేయలేను అని పలుకగా అర్జునునికి జ్ఞాన బోధ చేసే సాకుతో ఈ ప్రపంచానికి భారత జాతికి సమాజంలో మెలగవలసిన పద్ధతి, మానవ జన్మ ఎత్తినందుకు సాధించవలసిన విషయాలు సుస్పష్టంగా బోధించాడు.

శ్రీకృష్ణ భగవానుడు మన హృదయాలలో నిలచి, మనకు కర్తవ్య బోధచేయుగాక! స్వామి ఆశీస్సులు మనకుతోడై ఉండు గాక! అందుకే శ్రీరామకృష్ణ గోవిందా.

**72. రఘుకులనందన గోవిందా :** రఘుకులం అనగా రఘు వంశం. నందన అనగా కుమారుడు. శ్రీరాముడు రఘువంశంలో జన్మించాడు. కనుక రఘుకులనందన గోవిందా అన్నారు.

**73. ప్రత్యక్షదేవా గోవిందా :** ఉన్నది ఉన్నట్లుగా కనిపించడమే ప్రత్యక్షం శ్రీ మహావిష్ణువు కలియుగంలో శ్రీ వేంకటేశ్వరస్వామిగా కనుపిస్తున్నాడు.

స్వామి ఆలయంలో ఎలా ఉన్నాడంటే! వజ్ర కిరీటం, నవరత్నాలతో చేయబడిన హారాలు, కంకణాలు, సూర్య, చంద్రులవలె ప్రకాశించే కుండలాలు, కౌస్తుభమణిని ధరించి పట్టు పీతాంబరాలను ధరించి ఫాలభాగాన కస్తూరి తిలకంను ధరించి శంఖ చక్రాలను ధరించి, చిరు నవ్వులతో కటి, వరద హస్తాలతో కోటి సూర్య కాంతులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ తిరుమల కొండను కలియుగ వైకుంఠంగా చేసుకొని నిరంతరం శ్రీనివాసునిగా భక్తుల కోర్కెలను తీరుస్తూ శ్రీమహా విష్ణువు శ్రీనివాసునిగా ప్రత్యక్ష రూపంలో అనుగ్రహిస్తున్నాడు. అందుకే ప్రత్యక్షదేవా గోవిందా... అన్నారు.

**74. పరమ దయాకర గోవిందా :** అంటే భక్తులపట్ల మిక్కిలి దయకల వాడు. మాంధాత అనే రాజు యొక్క కుమారుడు ముచికుందుడు.

ముచికుందుడు కొన్ని సంవత్సరాలపాటు రాక్షస సంహారం చేసి దేవతలకు, రాక్షసబాధ తప్పించాడు. దేవతలు ముచికుందునితో రాజా మీ అనుగ్రహంవల్ల రాక్షస బాధ తగ్గింది. మేమందరం ఆనందంతో జీవించగల్గుతున్నాం. మమ్ములను అనుగ్రహించి ఒక వరం కోరుకోండి ఇస్తాం అన్నారు.

ముచికుందుడు నాకు గాఢ నిద్ర కావాలి అన్నాడు. వారు అంగీకరించి వెళ్ళారు. ఒక కొండ గుహలో చాలాకాలం నిద్రించాడు. తరువాత వాసుదేవుడు అక్కడికి వెళ్ళగా ముచికుందుడు చేతులు జోడించి నమస్కరించి స్వామీ మీరెవ్వరు? మిమ్ములను చూడగానే మీ సేవ చేయాలని అనిపిస్తుంది అని అర్థించాడు.

వాసుదేవుడు, ఓ రాజనందనా నేను వాసుదేవుడను. ప్రస్తుతం రాక్షస సంహారం అనే పనిలో ఉన్నాను. ఆది నుండి నీవు నా భక్తుడవు. ఏమి వరం కావాలో కోరుకో అన్నాడు.

పురుషోత్తమా! నీకిదే నా నమస్కారం. ఈ ప్రపంచంలో మానవు లందరూ భార్యా బిడ్డలతో, సంపదలతో తులతూగుతూ, మత్తులోపడి క్లేశాలను అనుభవిస్తారేగాని, నీ నామస్మరణమే సర్వోత్కృష్ట ఫలదాయిని అని తెలుసుకోలేక పోతున్నారు.

ఆ వ్యామోహంలో చిక్కుకొని ఏమేమో భోగాలు వాంఛిస్తూ జనన మరణ వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. నా అదృష్టవశాన నీ దర్శన భాగ్యం లభించింది. నాకే కోరిక లేదు. నీవే నాకు దిక్కు అని తలవంచి నిలబడ్డానున్నాడు. వాసుదేవుడు, మహారాజా నీ జన్మ ధన్యమైంది. ఒక మాట ఎవరైనా కర్మఫలం అనుభవించక తప్పదు కనుక ఈ జన్మలో నీవు వినోదంగా వేటాడి జీవహింస చేసిన పాపం

ఉంది. తపస్సుతో ఆ పాపం ప్రక్షాళన చేసుకొని మరో జన్మలో ఉత్తమ సంస్కారం పొంది నన్ను చేరుతావు. అనగా ముచికుందుడు సంతోషించాడు. తరువాత శ్రీహరిలో ఐక్యమయ్యాడు. అందుకే పరమ దయాకర గోవిందా అన్నారు.

**75. వజ్రకవచధర గోవిందా :** అనగా వజ్రాలు పొదిగి తయారుచేసిన కవచంను ధరించినవాడని అర్థం. వజ్రాన్ని కోయడానికి వజ్రాన్నే ఉపయోగించాలి అంటారు. వజ్రం అభేధ్యమైనదని అర్థం. అటువంటి వజ్రకవచంను ధరించిన శ్రీహరిని ఎవరూ ఎదిరించలేరని కూడ అర్థం. అందుకే వజ్రకవచధర గోవిందా.

**76. వైజయంతిమాల గోవిందా :** వైజయంతి మాలను, రత్నాల హారాన్ని ధరించిన వాడు శ్రీహరి. కనుకనే వైజయంతిమాల గోవిందా అంటారు.

**77. వడ్డీకాసులవాడ గోవిందా :** లోక కళ్యాణార్థం ఋషులు యజ్ఞం చేస్తూ యజ్ఞహవిస్సును ఎవరికి సమర్పించాలి. హవిస్సును తీసుకొనేందుకు త్రిమూర్తులలో ఎవరికి అర్హత ఉన్నదో తెలుసుకోవాలని భృగుమహర్షిని పంపారు. అతను సత్యలోకం వెళ్ళగా బ్రహ్మదేవుడు సరస్వతితోను, కైలాసం వెళ్ళగా శివుడు పార్వతితోను, వైకుంఠం వెళ్ళగా శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవితోను సరస సల్లాపాలాడుతుండడం గమనించి ఆగ్రహించి తన కాలితో శ్రీహరి వక్షస్థలంపై కొట్టాడు. శ్రీహరి మహర్షియొక్క కాలును తన రెండు చేతులలోనికి తీసుకొని నా వక్షస్థలంపై కొట్టడం చేత తమ కాలుకు నొప్పి కలిగినదా మహాత్మా అని అనునయించే మాటలు మాట్లాడుతూనే అతని అరికాలులో ఉండే అహంకారమను కన్నును చిదిమేశాడు.

వెంటనే భృగుమహర్షి తన తప్పును తెలుసుకొని శ్రీహరిని యజ్ఞహవిస్సును స్వీకరించవలసినది అని కోరుతూ శ్రీహరి శాంత గుణంను గూర్చి వేనోళ్ళ పొగిడి అక్కడి నుండి భూలోకానికి వచ్చేశాడు. ఇదంతా చూస్తున్న లక్ష్మి తను నివసించే శ్రీహరి వక్షస్థలంపై తన్నిన మహర్షిని శిక్షించకపోవడంతో కోపగించి వైకుంఠంను వీడి భూలోకంలో కొల్హాపురానికి చేరి, శ్రీహరిని గూర్చి తపస్సు చేయనారంభించింది. శ్రీమహాలక్ష్మి లేని వైకుంఠంలో తాను ఉండలేక శ్రీమహా విష్ణువు భూలోకానికి వచ్చి తిరుమల కొండ ప్రాంతంలో ఒక పుట్టలో ఉండగా తెలుసుకున్న శ్రీమహాలక్ష్మి బ్రహ్మను ఆవుగా, శివుని దూడగా చేసి చోళరాజ్యానికి వచ్చి ఆ ఆవును చోళ రాజునకు అమ్మింది. ఆ ఆవు ప్రతి రోజూ పుట్టలోనున్న శ్రీహరికి తన పొదుగు నుండి పాలను కురిపించేది.

దీనిని గమనించిన గోవుల కాపరి తన గొడ్డలితో ఆవుపై ఒక్క వేటు వేశాడు. గోవు పారిపోగా పైకి లేచిన శ్రీహరి తలపై తగిలింది. తరువాత ఆ ప్రాంతంలో నివసిస్తున్న వకుళమాత శ్రీహరి తన కుమారునిగా గుర్తించి ఆకాశరాజు కుమార్తెతో వివాహం నిశ్చయించింది. శ్రీహరి కుబేరుని వద్ద ధనం అప్పుతీసుకొని వివాహం చేసుకొన్నాడు. ఆ అప్పుకు వడ్డీగా కలియుగంలో భక్తులు సమర్పించే కానుకలన్నీ కుబేరునికి చెల్లిస్తున్నాడు. కనుక వడ్డీకాసులవాడ గోవిందా!

**78. వసుదేవతనయా గోవిందా :** దేవకీ వసుదేవులకు శ్రీమహావిష్ణువు కుమారుడై జన్మించటంవలన వసుదేవతనయా గోవిందా అన్నారు.

**79. బిల్వపత్రార్చిత గోవిందా :** బిల్వపత్రం అనగా మారేదు ఆకు. మారేదు ఆకులతో పూజింపబడటం శ్రీహరికి ప్రీతికరమైనది. శ్రీమహాలక్ష్మి అష్టోత్తర శతనామాలలో 77వ నామము "బిల్వ నిలయాయై నమః" అనగా బిల్వ దళాలలో శ్రీమహాలక్ష్మి వున్నది కనుక శ్రీమహా విష్ణువును బిల్వ పత్రార్చిత గోవిందా అంటారు.

**80. భిక్షుకసంస్తుత గోవిందా :** భిక్షుక వృత్తియనగా పూర్వకాలంలో కొందరు మునులు, గురుకులంలో విద్య నభ్యసించే శిష్యులు, గ్రామంలోనికి వెళ్ళి భిక్షను యాచించేవారు. ఆ వచ్చిన ధాన్యం తోనే ఆ రోజు ఆహారాన్ని తయారు చేసుకొని జీవించేవారు. వారికి కావలసిన ఆహార పదార్థాలు, ఇండ్లలో నిలువ చేసుకొనేవారు కాదు.

ఆ మహర్షులు అలా జీవిస్తూ లోక కల్యాణార్థం తపస్సు చేయటం, యజ్ఞయాగాదులు నిర్వహించటం, నిరంతరం శ్రీహరిని ధ్యానిస్తూ శ్రీహరి కథలను వింటూ, శ్రీహరి పూజలు చేస్తూ శ్రీహరి గీతాలను గానం చేస్తూ, శ్రీహరిని స్తుతిస్తూ నిరంతరం శ్రీహరి నామజపం చేస్తూ గడిపేవారు. అందుచేత భిక్షుక సంస్తుత గోవిందా అంటారు.

**ప. నీకు మ్రొక్కెద అత్యంత నియమ మొప్ప**
**భవ్యచారిత్ర, పంకజపత్ర నేత్ర**
**చిర శుభాకార, నిత్యలక్ష్మీ విహార**
**అవ్యయానంద, గోవింద, హరి, ముకుందా**

**81. స్త్రీపుంరూపా గోవిందా :** అనగా స్త్రీ రూపం ధరించిన పురుషుడు. పూర్వం దేవతలు, రాక్షసులు అమృతాన్ని సాధించాలని మంధర పర్వతాన్ని కవ్వంగా వాసుకి అను సర్పరాజును త్రాడుగా చేసి దేవతలు

ఒకవైపు, రాక్షసులు మరొక వైపు పట్టుకొని పాలసముద్రాన్ని చిలుకగా, చిలుకగా ముందుగా హాలాహలం అనగా విషం పొగవలె పైకి వచ్చింది. అది అంతటా వ్యాపిస్తే భూమండలంలోని ప్రాణులన్నీ నశిస్తాయి కనుక దేవతలందరూ శివున్ని ప్రార్థించగా శివుడు ఆ విషాన్ని ఒక గుళికగా చేసి కంఠంలో ఉంచుకొన్నాడు. కనుకనే శివునికి గరళకంఠుడని పేరు.

తరువాత ఐరావతం అనే తెల్లని ఏనుగు పైకి వచ్చింది. దానిని దేవేంద్రునకు ఇచ్చారు. కల్పవృక్షం రాగా స్వర్గంలో ఉంచారు. శ్రీమహాలక్ష్మి ఉద్భవించగా శ్రీహరికిచ్చారు. చివరకు అమృతం బయటకు వచ్చింది. దానిని ఎలాగైనా దేవతలకు పంచి, రాక్షసులకు ఏమీ ఇవ్వకూడదని శ్రీహరి ఆలోచించాడు. ఒక అందమైన స్త్రీగా మోహినీ అవతారాన్ని ధరించిన శ్రీహరి దేవతలు, రాక్షసులతో మీరు అందరూ వెళ్ళి స్నానంచేసి వచ్చి దేవతలు ఒక వరుసలోనూ, రాక్షసులు ఒక వరుసలోనూ కూర్చోండి. నేను మీ అందరికీ అమృతం పంచుతానని చెప్పాడు.

వారు అలాగే చేయగా, మోహినీ రూపాన్ని ధరించిన శ్రీహరి బంగారు అమృత భాండాన్ని చేబట్టి, హొయలొలికిస్తూ దేవతలకు మాత్రమే అమృతం పంచసాగాడు. రాక్షసులందరు మోహిని రూపంలోని శ్రీహరి అందచందాలను చూస్తూ మైమరచిపోసాగారు. తప్ప అమృతాన్ని గురించి ఆలోచించలేదు. అది గ్రహించిన రాహు అను రాక్షసుడు సూర్య చంద్రుల మధ్యలోకివచ్చి కూర్చోగా జగన్మోహిని ఆ రాక్షసునికి కూడ అమృతం అందించగా త్రాగేశాడు. సూర్య చంద్రులు మోహినికి సైగ చేసి రాక్షసుడని చెప్పారు.

వెంటనే మోహిని రూపంలోని శ్రీహరి సుదర్శన చక్రంతో రాహువు తల ఖండించాడు, అమృత పానం చేసినందువల్ల రాహువుకి తల భాగం సజీవం కాగా, అతని శరీరంలోనికి శ్రీహరి ఆజ్ఞచే కేతు గణం ప్రవేశించడం వల్ల అది కూడా సజీవమయ్యింది. సూర్యచంద్రులు మోహినికి తెలిపారన్న కోపంతో అప్పుడప్పుడు గ్రహణరూపంలో సూర్యచంద్రులకు రాహుకేతువులు ఆటంకం కలిగిస్తుంటారు. దానినే మనం సూర్య గ్రహణం, చంద్ర గ్రహణం అంటాం. రాక్షసులకు మాత్రం అమృతం లభించలేదు.

ఐతే ఈ కథ విన్న తరువాత మనకు ఒక అనుమానం వస్తుంది. దేవతలూ, రాక్షసులూ కలిసి అమృతాన్ని సాధించారు, కాని శ్రీహరి దేవతలకు మాత్రమే అమృతాన్ని ఇవ్వటం అన్యాయం చేయటం కాదా! అలా భగవంతుడు పక్షపాతం చూపవచ్చా అని అనుకుంటాం.

దేవతలూ, రాక్షసులూ, ఇద్దరూ కశ్యప ప్రజాపతి పిల్లలే, అన్న దమ్ములే, కాని మంచిపనులు చేసేవారిని దేవతలని, దుష్టక్రియలు అనగా ఇతరులకు హానిచేసేవారిని, నష్టపరిచేవారిని రాక్షసులని అంటారు. ఎక్కడ మంచిప్రవర్తన ఉంటుందో, ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ మాత్రమే శ్రీహరి వుంటాడు. ధర్మ మార్గంలో నడిచేవారిని మాత్రమే శ్రీహరి రక్షిస్తాడు. ఆపదలలో కాపాడుతాడు. దుష్టక్రియలు చేసేవారు కొంతకాలం మాత్రమే అహంకారంతో విర్రవీగుతారు. పాపాలు పెచ్చు పెరిగితే పరమాత్ముని కోపానికి గురి అవుతారు.

అందువలననే ఎంత కష్టపడ్డా రాక్షసులు అమృతాన్ని త్రాగలేక పోయారు. మనమందరం సత్ప్రవర్తన కలిగి తోటివారికి హాని చేయకుండా చేతనైన సహాయంచేసి శ్రీహరి కృపకు పాత్రులమవుదాం.

**82. శివ కేశవమూర్తి గోవిందా :** శివ అనగా శంకరుడు, కేశవ అనగా హరి. శివకేశవులు ఇరువురికి తేడా లేదు అందుకే

"శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే
శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః"

అని అన్నారు. కనుకనే శివకేశవమూర్తి గోవిందా అన్నారు.

**83. బ్రహ్మాండరూపా గోవిందా :** చాలా గొప్పదిగా వున్న రూపం. నామరూపాత్మకమై, చిత్రాతి చిత్రమై, వికసించి విస్తరించి, విరాజిల్లుతూ కనిపిస్తున్న సర్వ ప్రపంచానికి పరబ్రహ్మయే కారణ మగుటచే, పరమాణువు నుండి మొదలుకొని ప్రతి వస్తువులోనూ నిండివున్న వాడగుటచే బ్రహ్మాండరూపా అంటారు.

**ప. హరిమయము విశ్వమంతయు**
**హరి విశ్వమయుండు సంశయము పనిలేదా**
**హరి మయముగాని, ద్రవ్యము**
**పరమాణువు లేదు వంశపావన వింటే.**

అని భాగవతం చెబుతున్నది. ఈ విశ్వమంతా భగవానుని విరాట్ స్వరూపమేనని గీతాచార్యుడు శ్రీకృష్ణుడు బోధించాడు. భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకాలనే ఇవి 7 ఊర్ధ్వలోకాలు. అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళలోకాలు అనే ఈ 7 అధోలోకాలు. ఈ 14 లోకాలు ఒక బ్రహ్మాండం.

మహాత్మునకు భూమి పాదాలు, ఆకాశం నాభి, వాయువే ప్రాణం, సూర్యచంద్రులే నేత్రాలు, స్వర్గమే శిరస్సు, అగ్నియే ముఖం,

సముద్రమే దివ్య మందిరం. ఏ మహామూర్తి యందు అనంత విశ్వం భాసిల్లుచున్నదో, దేవతలు, నరులు, పక్షులు, గోవులు, సర్పాలు, గంధర్వులు, దైత్యులు మున్నగు వారితో ఆయా లోకాలలో గూడి, చిత్ర, విచిత్రంగా శోభిల్లుచున్నవో మరియు ఎవ్వడు మూడు లోకాలను తన శరీరంగా కలిగివున్నాడో అట్టి సర్వవ్యాపి, సర్వేశ్వరుడును అగు ఆ సచ్చిదానంద పరబ్రహ్మమునకు నమస్కరించుచున్నాను.

ఈ పరబ్రహ్మం మనకు సర్వదా తోడై ఉండి ఆత్మజ్ఞాన బోధ చేయుచూ మనలను రక్షించునుగాక! అందుకే బ్రహ్మాండరూపా గోవిందా అన్నారు.

**84. భక్తరక్షకా గోవిందా :** అనగా భక్తితో ప్రార్థించేవారిని రక్షించేవాడు అని అర్థం.

పూర్వం ఉత్తానపాదుడు అను మహారాజు ఉండేవాడు. ఈయన పెద్ద భార్య పేరు సునీతి. రెండవ భార్య పేరు సురుచి. పెద్ద భార్య కొడుకు పేరు ధ్రువుడు. రెండవ భార్య కొడుకు పేరు ఉత్తముడు. ఒక రోజు మహారాజు సింహాసనంపై కూర్చొని వుండగా ఉత్తముడు వెళ్ళి తండ్రితొడపై కూర్చుంటాడు. ధ్రువుడు కూడా తండ్రి తొడపై కూర్చొనబోగా ఉత్తముని తల్లి సునీతి వచ్చి నీవు నీ తండ్రి తొడపై కూర్చొనరాదు. అటువంటి యోగం నీకుంటే నీవు నా కడుపునపుట్టి ఉండేవాడివి, నా సవతి కొడుకుకు ఆ అదృష్టం లేదు అని అంటుంది.

ధ్రువుడు తల్లివద్దకు ఏడుస్తూ వెళ్ళి జరిగింది చెబుతాడు. ఆమె ధ్రువుని ఓదారుస్తూ కుమారా బాధపడకు శ్రీహరి ధ్యానంవలన నెరవేరని కోరికలంటూ ఉండవు. నీవు శ్రీహరినే ధ్యానించు అంతకన్నా ఉన్నతమైన ఆసనాన్నే నీవు అలంకరించవచ్చు అంటుంది.

తల్లి అనుమతిని పొందిన ధ్రువుడు శ్రీహరిని ధ్యానించేందుకు అరణ్యానికి వెళ్ళుతూండగా నారదుడు కనిపించి విషయాన్ని తెలుసుకొని కుమారా! నీవు చిన్నవాడవు తపస్సు చేయలేవు. ఇంటికి వెళ్ళమంటాడు. శ్రీహరి ప్రత్యక్షం కానిదే నేను ఇంటికి వెళ్ళనంటాడు ధ్రువుడు. అతని పట్టుదలకు మెచ్చి నారదుడు నారాయణ మంత్రాన్ని ఉపదేశిస్తాడు.

ధ్రువుడు కఠోరమైన నియమాలతో తపస్సు చేస్తాడు. అతని తపస్సుకు ముల్లోకాలు గజ గజలాడుతాయి. అపుడు శ్రీహరి ప్రత్యక్షమవ్వగా ధ్రువుడు శ్రీహరిని గూర్చి స్తుతిస్తాడు.

అపుడు శ్రీహరి, కుమారా! సప్త ఋషులతో నిఖిల తారా గోళాలు సూర్యాది గ్రహమండలాలూ నిరంతరం ప్రదక్షణ చేసే "ధ్రువక్షితి" అనే స్థానం నీకు కల్పిస్తున్నాను. ప్రళయకాలంలో కూడ అది నశించదు. అక్కడకు చేరటానికి ముందు నీవు కొంతకాలం రాజ్య పాలన చెయ్యాలి అని చెప్పి అదృశ్యమవుతాడు.

ధ్రువుడు ఇంటికి తిరిగి రాగా ప్రజలందరూ స్వాగతం పలుకుతారు. తండ్రి ఆనంద భాష్పాలతో ఆలింగనం చేసుకొని రాజ సౌధానికి తీసుకొని వెళ్ళి పట్టాభిషిక్తున్ని చేస్తాడు.

భ్రమి, ఇల, అనే కన్యలను వివాహమాడి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తెను పొందిన ధ్రువుడు ధర్మబద్ధంగా రాజ్య పరిపాలన చేసి కొంతకాలానికి శ్రీమన్నారాయణుడు అనుగ్రహించిన విధంగా అత్యంత ఉన్నతమైన ధ్రువ మండలాన్ని చేరుకుంటాడు.

ఈ కథ విన్న మనలను శ్రీమన్నారాయణుడు సర్వదా కాపాడునుగాక.

**85. నిత్యకల్యాణ గోవిందా :** కల్యాణం అనగా శుభాన్ని కల్గించునది. శ్రీహరి నామం ఎక్కడ నిత్యం వినిపిస్తుందో అక్కడ నిత్యం శుభాలే జరుగుతాయి.

కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ప్రతిరోజు కల్యాణోత్సవ కైంకర్యాన్ని నిర్వహిస్తారు. తిరుమల శ్రీవారి ఆలయం నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతూంది. స్వామివారు నిత్యకల్యాణ చక్రవర్తిగా విరాజిల్లుతున్నారు.

లోకకల్యాణం కొరకు శ్రీహరి నిత్యకల్యాణోత్సవాలను స్వీకరిస్తూ భక్తులను అనుగ్రహిస్తున్నాడు. కనుకనే నిత్యకల్యాణ గోవిందా అని భక్తులచే కీర్తింపబడుతున్నాడు.

**86. నీరజనాభా గోవిందా :** నీరజం అనగా నీటి నుండి పుట్టిన తామరపువ్వు. నాభి అనగా బొడ్డు. శ్రీహరి యొక్క నాభి నుండి తామరపువ్వు ఉద్భవించగా, ఆ తామర పువ్వు నుండి బ్రహ్మదేవుడు ఉద్భవించి ఈ సృష్టి కార్యాన్ని జరుపుతున్నాడు. కనుకనే శ్రీహరికి నీరజనాభుడు, కమలనాభుడు పద్మనాభుడు అనే పేర్లు వచ్చాయి.

**87. హాథీరామ ప్రియ గోవిందా :** హాథీరామ బాబా శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తుడు. తిరుమలలో ఆనందనిలయాన్ని దర్శిస్తూ నిరంతరం స్వామి ధ్యానంలోనే గడిపేవాడు. స్వామి సర్వాంతర్యామి ఎవరి హృదయం ఎటువంటిదో గ్రహించగలడు కనుక హాథీరామబాబా తనను నిరంతరం స్మరించుటచే అప్పుడప్పుడు వచ్చి బాబాతో స్వామివారు సంభాషించేవారు.

హాథీరామబాబా స్వామితో ఎంతసమయం గడిపినా అతని మనస్సు ఆనందంగానే ఉండేది. అలాగే బాబాతో పాచికలు ఆడుతూ

ఉండేవాడు. భక్తులను నిరంతరం భగవంతుడు అనుగ్రహిస్తూనే ఉంటాడు కదా! ఆనోట ఈనోట ఈ వార్తను విన్న అర్చకులు హాథీరాంబాబ అసత్య ప్రచారం చేస్తున్నాడన్న నెపంతో అతనిని పిలిపించి నీవు భక్తుడవైతే, స్వామివారు పాచికలాడేందుకు నీవద్దకు రావడం సత్యమైతే ఒక టన్ను చెరకు తెల్లవారేసరికి తినమని అన్నారు. చెరకును అక్కడపెట్టి వారు వెళ్ళారు. బాబా శ్రీవారిని ధ్యానిస్తూ కూర్చున్నాడు. స్వామి వారు ఏనుగు రూపంలో వచ్చి చెరకు మొత్తం తిన్నారు. ఇది గమనించిన పూజారులు స్వామి భక్తవత్సలుడని, అందుకే హాథీరాముణ్ణి అనుగ్రహించాడని భావించారు. అందుకే హాథీరామప్రియ గోవిందా !

88. **హరిసర్వోత్తమ గోవిందా :** కలియుగంలో మానవులు శరీరబలం లేని నీరసులు, ధైర్యశూన్యులు అనగా ధైర్యం లేనివారు, మందబుద్ధులు అనగా తెలివితక్కువవారు, అల్పకాల జీవులు అనగా తక్కువ ఆయుష్షుగలవారు, దుర్భరులు అనగా బలం లేనివారు. ఈ దశలో వారికి సత్కార్యాలు, సత్క్రతువులూ చేసే శక్తి ఉండదు. అటువంటివారు తరించాలంటే హరి నామస్మరణం, హరికథా శ్రవణం ఈ రెండే మార్గాలు. అందువలననే హరిసర్వోత్తమ గోవిందా అన్నారు.

శ్రీహరి సర్వవ్యాపి. బ్రహ్మాదిదేవతలందరిలోకి ఉత్తముడు. ఎవరు ఏ వరాలిచ్చినా ఆ వరాలు అనర్థాలకు దారితీయకుండా కాపాడేవాడు. సాక్షాత్తు పరమేశ్వరుడే పార్వతీదేవికి శ్రీహరి అవతారమైన శ్రీరామ అవతారంలోని రామ మంత్రాన్ని ఉపదేశించాడు. శ్రీహరిని కీర్తించాడు. అటువంటి సర్వోత్తముడు శ్రీహరి. అందుకే హరి సర్వోత్తమ గోవింద అంటారు.

**89. జనార్దనమూర్తి గోవిందా :** కేశవ నామాలలో జనార్ధనమూర్తి అనునది ఒక నామము. అందుకే జనార్ధనమూర్తి గోవిందా అన్నారు.

**90. జగత్సాక్షి రూపా గోవిందా :** అనగా సృష్టిలోని ప్రతి అణువులో భగవంతుడు ఉన్నాడు. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలలోను శ్రీహరి ఉన్నాడు. అన్నిటికి ఆయనే సాక్షి, కనుక ఆయనను జగత్సాక్షిరూపా గోవిందా అన్నారు.

**91. అభిషేకప్రియ గోవిందా :** అనగా ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనె, పండ్ల రసాలు, గంధం, మొదలగు పదార్థాలతో అభిషేకమంటే శ్రీహరికి చాలా ఇష్టమైన పూజా విధానం కనుక అభిషేక ప్రియ గోవిందా అంటారు.

**92. ఆపన్నివారణ గోవిందా :** అనగా ఆపదలనుండి రక్షించువాడు అని అర్థం. హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. అతని తల్లియైన లీలావతి కడుపులో ఉండగానే నారద మహర్షి ద్వారా నారాయణ మంత్రంను గురించి తెలుసుకున్నాడు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుం దన్నట్లుగా ప్రహ్లాదుడు పుట్టుకతోనే హరిభక్తుడైనాడు. గురువులను దైవంగా భావించేవాడు. పెద్దలను గౌరవించేవాడు.

స్నేహితులను సోదరభావంతో చూసేవాడు. హరినామ స్మరణతో సర్వాన్నీ మరచిన సమయంలో శ్రీహరి తన ప్రక్కనే యున్నట్లు భావించేవాడు. హిరణ్యకశిపుడు శ్రీహరిని విరోధిగా భావించాడు. కనుక ఎలాగైనా హరినామ స్మరణ మానిపించాలని విద్యాభ్యాసం కొరకు గురుకులానికి పంపాడు.

**ప. చదువని వా డజ్ఞుండగు**
**చదివిన సదసద్వివేక చతురత కలుగున్**

**చదువగ వలయును జనులకు**
**చదివించెద ఆర్యులొద్ద చదువుము తండ్రీ**

అంటూ చండామార్కులవారి వద్దకు శిష్యునిగా పంపాడు. గురువులు చెప్పిన దానిని యథాతథంగా చదివి వినిపించేవాడు. ఏనాడు వారితో వాద, ప్రతివాదంలకు దిగలేదు. హరి చరణారవిందమే శరణ్యమని త్రికరణశుద్ధిగా నమ్మేవాడు. హిరణ్యకశిపుడు కొంతకాలానికి కుమారుని పిలిపించి విద్యాగంధం ఎలా ఉన్నదో తెలుసుకోవా లనుకొన్నాడు. తనయుల సంభాషణలు జనకులకు కర్ణ భూషణాలు, సంతోష కారకాలు, ప్రహ్లాదుని పిలిపించి కుమారా! నీవు చదివినవి చెప్పు నాయనా అన్నాడు.

తండ్రీ! ఈ దేహధారులందరూ సంసారమనే చీకటి కూపంలో పడి, బయట పడలేక, స్వ, పర భేదాన్ని వీడలేక మతి చలించి భ్రమలో పడుతున్నారు. ఈ విశ్వమంతా విష్ణుమాయగా భావించి హాయిగా ప్రశాంతమైన వనంలో నివసించటం మేలు అని తెలుసుకోలేక పోతున్నారు అన్నాడు.

హిరణ్యకశిపుడు నవ్వి ప్రహ్లాదుని దగ్గరకు తీసుకొని నాయనా దేవతలను హింసించడం, దేవేంద్రుని పాదాక్రాంతునిగా చేయటం, మునులను దుఃఖపెట్టడం అలాగే శ్రీహరిని ఆరాధించే వారందరినీ బాధించడం చేయవలసిన నువ్వు హరీ, గిరీ, అంటూ చెడిపోతున్నావు. అది మన వంశానికే కళంకం అన్నాడు.

ఈ బాలుని హితవచనాలతో మార్చలేమని, దండించి దారికి తేవాలని హిరణ్యకశిపుడు అనుకున్నాడు.

క్రూర రాక్షసులు ప్రహ్లాదుని మండుటెండలో నిలబెట్టి శూలాలతో పొడిచారు. ఎంత పొడిచినా శరీరం కందలేదు. రక్తపుచుక్క కారలేదు. ఏ మాత్రం బాధపడలేదు ప్రహ్లాదుడు.

"ఓ శేషశాయీ, దైత్య మర్దన, జగదీశ, ఆపన్న శరణ్య, నిఖిల పావనమూర్తీ" అని శ్రీహరినే మనస్సులో నిలిపి నిలబడ్డాడు. మదగజంచేత త్రొక్కించారు. కోడె త్రాచులతో కరిపించారు. ఆకాశాన్నంటే మంటలలో వేశారు. సముద్రము లోనికి విసిరారు. విషం పెట్టారు. ఎత్తైన కొండల మీద నుండి క్రిందికి తోయించారు. మండుటెండలో నిలబెట్టారు. కుండపోత వానలో వదిలేశారు. ఆహార పానీయాలు లేకుండా చేశారు. గధలతో, కొరడాలతో హింసించారు.

ఇన్ని చేసినా ప్రహ్లాదుడు హరిభక్తి ఏ మాత్రం మానలేదు. హిరణ్య కశిపుడు ప్రహ్లాదునితో చతుర్దశ భువనాలు జయించిన నన్ను ఎదిరించే ధైర్యం ఆ దేవతలకు ఎక్కడిది? ఎవడురా నీకు దిక్కు, ఎవడి బలం చూసుకొని ఇలా ప్రవర్తిస్తున్నావని గర్జనతో అడిగాడు.

ప్రహ్లాదుడు నవ్వుతూ, దానవేశ్వరా! లోకాలన్నీ నిముషాలలో జయించావు. కానీ ఇంద్రియాలను వశపరచుకోలేకపోయావు. నీలో ఉన్న అరిషడ్వర్గాలే నీకు శత్రువులు. ముందు ఆ అంతశ్శత్రువులను ఛేదించు అప్పుడింక శత్రువనే వాడుండడు. విశ్వవ్యాపి అయిన విష్ణువే సర్వేశ్వరుడు సకలలోకాలకు అధిపతి తప్ప ఇంకెవరూ కారు అని హితంపలికాడు.

ఓరీ మూర్ఖుడా! నీ హరి విశ్వవ్యాపి అయితే ఈ స్తంభంలో ఉన్నాడా అని హిరణ్యకశిపుడు హుంకరించాడు. నన్ను అడగటం దేనికి నీవే చూడు అన్నాడు ప్రహ్లాదుడు.

హిరణ్యకశిపుడు వజ్ర సదృశమైన తనగధతో ఆ స్తంభంమీద గట్టిగా కొట్టాడు. అంతే హిరణ్యకశిపునికి విధాత ఇచ్చిన వరాలను సత్యంచేస్తూ అటు నరుడు ఇటు మృగము కాకుండా నరమృగ శరీరంతో నరసింహాకృతిలో శ్రీహరి ఆవిర్భవించి గర్జించి, జూలు విదిలించి, దృష్టి సారించి, ఒక్క దూకులో హిరణ్యకశిపుని పట్టి పదునైన గోళ్ళతో ప్రేవులు లాగి మెడలో వేసుకొని భయంకర ఆకారంతో సింహాసనమెక్కి కూర్చొన్నారు. ఉగ్రనరసింహుడు ప్రహ్లాదుడు ప్రార్థించగా తన ఉగ్రరూపంను తగ్గించి, శాంత చిత్తుడై, కర్మ బంధాలు సడలగానే వైకుంఠం పొందగలవని ప్రహ్లాదుని దీవించి అదృశ్యమయ్యాడు.

ఈ విధంగా తన భక్తుల ఆపదలన్నీ పోగొడ్తాడు కనుకనే ఆపన్నివారణ గోవిందా అన్నారు. ప్రహ్లాద వరదుడు మన అందరి ఆపదలను తొలగించును గాక!

**93. రత్నకిరీట గోవిందా :** నవరత్నాలతో చేయబడిన కిరీటంను ధరించుటచే స్వామికి రత్నకిరీట గోవిందా అన్నారు.

**94. రామానుజనుత గోవిందా :** రామానుజుడు విశిష్టాద్వైత మతోద్ధారకుడు. దీనిలో భాగంగా అతను విష్ణువును స్తుతించుటచే రామానుజనుత గోవిందా అని అన్నారు. రామ అనుజ అంటే రాముని తమ్ముడు అని అర్థం. త్రేతాయుగంలో శ్రీరాముడు లక్ష్మణునిచే సేవింపబడినవాడు, పూజింపబడినవాడు, గౌరవించ బడినవాడు. కనుకనే రామానుజనుత గోవిందా!

**95. స్వయం ప్రకాశ గోవిందా :** సూర్యుని ఎవ్వరూ వెలిగించరు. తనంత తానుగా ప్రకాశిస్తాడు. స్వయం ప్రకాశం కలవాడు. అలాగే స్వామి కూడ స్వయం ప్రకాశకుడు కనుక స్వయంప్రకాశ గోవిందా అన్నారు.

**96. ఆశ్రితపక్ష గోవిందా :** అనగా ఆశ్రయించిన వారి పక్షాన ఉండేవాడు. భూదేవి కుమారుడు నరకుడు. వీడు బల, మద, గర్వంతో అదితి కుండలాలు హరించాడు. వరుణ దేవుని ఛత్రం అపహరించాడు. మణి పర్వతం ధ్వంసం చేశాడు. దేవతలను, ఋషులను, మానవులను బాధించాడు. ఈ బాధలు భరించలేక దేవేంద్రుడు వాసుదేవునికి మొరపెట్టుకున్నాడు. నరకాసురుని వధించటానికి శ్రీకృష్ణుడు బయలుదేరే సమయంలో సత్యభామ కూడ వాసుదేవునితో యుద్ధానికి బయలుదేరింది. వద్దని వారించినా వినలేదు.

రథాన్ని అధిరోహించి నరకుని పట్టణం ప్రగ్జ్యోతిష నగరానికి చేరారు. పాంచజన్యం పూరించి ముందుగా మురాసురుడు అనే రాక్షసుని హతమార్చారు. తరువాత నరకునితో యుద్ధంచేసి సంహరించారు. దేవతల, ఋషుల, మానవుల బాధలను తొలగించాడు. అందుకే ఆశ్రితపక్షా గోవిందా అన్నారు.

**97. నిత్య శుభప్రద గోవిందా :** ప్రతిరోజు శుభాలను ప్రసాదించే వాడని అర్థం. ఎల్లప్పుడు దేవుని స్మరించి కార్యక్రమాలు చేపడితే, దేవుడు తోడుగా ఉండి, విజయాలను ప్రసాదిస్తాడు. అందువలన నిత్యశుభప్రద గోవిందా అంటారు. శాశ్వత సుఖంను ఇచ్చువాడు గనుక నిత్యశుభప్రద అంటారు.

**98. నిఖిలలోకేశా గోవిందా :** అన్ని లోకాలకు అధిపతి, సర్వాంతర్యామి అగుటచేత శ్రీహరిని నిఖిల లోకేశా గోవిందా అంటారు.

**99. ఆనందరూపా గోవిందా :** శ్రీనివాసుడు ఎల్లపుడు మందస్మిత సుందర వదనారవిందుడు. అనగా నవ్వురాజిల్లెడు మోమువాడు అందుచేత ఆనందరూపా గోవిందా అంటారు.

శ్రీహరి సత్, చిత్, ఆనందరూపుడు = సచ్చిదానందరూపుడు.

**100. ఆద్యంతరహితా గోవిందా :** ఆది అనగా మొదలు, అంతం అనగా చివర, మొదలు చివర లేనివాడు ఎల్లపుడు ఉండేవాడు సర్వకాల సర్వావస్థలయందు ఉండేవాడు అని అర్థం.

**101. ఇహపరనాయక గోవిందా :** ఇహ అనగా ఈ భూలోకం. పరం అనగా పరలోకం. ఈ రెండు లోకాలకు అధినాయకుడు శ్రీహరి. కనుకనే ఇహపరనాయక గోవిందా అంటారు.

**102. ఇభరాజరక్షక గోవిందా :** ఇభం అనగా మదపుటేనుగు. ఇభరాజ రక్షక అనగా గజరాజును రక్షించిన వాడు అని అర్థం.

గజేంద్రుడు ఒక అడవిలో, కొలనులో మొసలితో పెనుగులాడుతూ ఓపిక నశించి ప్రాణాపాయంలో ఉన్నవేళ శ్రీహరి తన సుదర్శన చక్రంతో మొసలి తలను ఖండించి గజ రాజును రక్షించాడు. కనుక ఇభరాజ రక్షక గోవిందా అంటారు.

**103. పరమదయాళు గోవిందా :** అనగా మిక్కిలి దయగలవాడని అర్థం. సీతను రావణాసురుడు తీసుకొనివెళ్ళిన తరువాత సీతాన్వేషణలో రామలక్ష్మణులు క్రమంగా పంపానదీ తీరంచేరారు. నెమ్మదిగా ఆశ్రమ ద్వారం దాటి ప్రాంగణంలో అడుగుపెట్టారు. ఆ ప్రశాంత వాతావరణంలో ఒంటరిగా ఉన్న శబరి వీరిని చూస్తూనే చేతులు జోడించి పాదాభివందనం చేసి, అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి, గౌరవించింది. శ్రీరామునికి తినటానికి పండ్లనిస్తూ ఒక్కొక్క పండూ శబరి తిని రుచిచూసి తియ్యనిపండ్లను మాత్రమే రామలక్ష్మణులకు తినటానికి ఇచ్చింది.

శ్రీరాముడు శబరి ఇచ్చిన పండ్లను ప్రేమతో స్వీకరించాడు. లక్ష్మణుడు అన్నవైపు చూడగా చిరునవ్వు నవ్వాడు. భక్తితో సమర్పించిన వానిని స్వామి దయతో స్వీకరిస్తాడు. కనుక పరమ దయాళు గోవిందా అంటారు.

**104. పద్మనాభ హరి గోవిందా :** నాభియనగా బొడ్డు. పద్మమును నాభియందు కలవాడు కనుక పద్మనాభ హరి గోవిందా అంటారు. పద్మనాభుడు అన్నా, కమలనాభుడు అన్నా శ్రీహరియే.

**105. తిరుమలవాసా గోవిందా :** తిరుమల క్షేత్రంలో శ్రీనివాసుడను పేరుతో శ్రీహరి కొలువై వుండడం చేత తిరుమల వాసా గోవిందా అంటారు.

**106. తులసీ వనమాల గోవిందా :** తులసీ దళములచే తయారు చేయబడిన దండలు అనిన శ్రీ మహావిష్ణువుకు మహాప్రీతి. కనుక తులసీ వనమాలా గోవిందా అంటారు.

**107. శేషాద్రినిలయా గోవిందా :** అంజనాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి, వృషాద్రి, వేంకటాద్రి, గరుడాద్రి, శేషాద్రి అను ఏడుకొండలపై నిలచిన వేంకటేశ్వరుడు కనుక శేషాద్రినిలయా గోవిందా అంటారు.

**108. శేషశాయి గోవిందా :** శ్రీహరి ఆదిశేషునిపై పవళిస్తాడు. కనుకనే శేషశాయి గోవిందా అంటారు.

ఈ 108 గోవిందనామాలచే కొనియాడబడుతున్నవాడు గోవిందుడు; ఈ గోవిందనామాలన్నీ చదివిన వారికి, విన్నవారికి అందరికీ సర్వకాల సర్వావస్థలయందు శ్రీహరి తోడై వుండి సర్వులనూ రక్షించుగాక.

**సర్వం శ్రీమన్నారాయణార్పణమస్తు.**